

అందరి దృష్టి.. స్థానికంపైనే

ముందుగా పరిషత్ పోరు నిర్వహిస్తారనే సంకేతాలు

- బీసీలకు 42 శాతం రిజర్వేషన్లపై ఆర్డినెన్స్ వచ్చాక ప్రక్రియ
- రిజర్వేషన్లు, అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు కలిసి వస్తాయని భావిస్తున్న కాంగ్రెస్
- గతంలో చేసిన పనులు, ప్రభుత్వ వ్యతిరేకతపై బీఆర్ఎస్ ఆశలు
- ఈసారి స్థానిక సంస్థల ఎన్నికలపై బీజేపీ ప్రత్యేక దృష్టి
- పంచాయతీలు, పరిషత్‌లలో త్రిముఖ పోరు ఉండే అవకాశం



మహబూబ్‌నగర్ జిల్లా పరిషత్ కార్యాలయం

మహబూబ్‌నగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి ప్రతినిధి): స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కేబినెట్ తీర్మానం చేయడంతో అందరి దృష్టి స్థానిక సంస్థలపై పడింది. పంచాయతీ పాలకవర్గాల గడువు ముగిసి సంవత్సరన్నరపైగా అవుతుండటం, పరిషత్‌ల గడువు ముగిసి సంవత్సరం పూర్తవుతుండటంతో ఎన్నికలు ఎప్పుడు నిర్వహిస్తారనే సందేహాలు అందరిలో నెలకొన్నాయి. ప్రస్తుతం స్థానిక సంస్థలు ప్రత్యేక అధికారుల పాలనలో ఉండి, నిధులు రాక అభివృద్ధి కుంటుపడింది. అయితే కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సమయంలో బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42 శాతం రిజర్వేషన్లు ఇస్తామని హామీ ఇచ్చింది. అందులో భాగంగానే రిజర్వేషన్లు 50 శాతానికి లోబడి ఉండాలనే కేంద్ర ప్రభుత్వ నిబంధనల మేరకు ఆలస్యమవుతూ వచ్చింది. అయితే తమిళనాడు వంటి రాష్ట్రాల్లో ప్రత్యేక ఆర్డినెన్స్ ద్వారా 50 శాతానికి మించి రిజర్వేషన్లు ఇస్తుండటంతో ఇప్పుడు అదే పద్ధతిని రాష్ట్ర ప్రభుత్వం అవలంబించాలని భావిస్తోంది. ప్రస్తుతం అందుకు సంబంధించిన విధివిధానాలు ఖరారవుతున్నట్లు తెలుస్తుండగా, రేపో.. మాపో ఆర్డినెన్స్ వచ్చే అవకాశం ఉంది. హైకోర్టు ఇప్పటికే ఎన్నికలను పూర్తి చేయడానికి మూడు నెలల గడువు ఇవ్వగా.. ఆలోపే



పూర్తి చేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృత నిశ్చయంతో ఉంది. ప్రస్తుతానికి పంచాయతీలకంటే ముందు పరిషత్ ఎన్నికలే నిర్వహిస్తారనే సంకేతాలు వెలువడుతున్నాయి. మరి రాష్ట్ర ప్రభుత్వం ఏ విధంగా నిర్ణయం తీసుకుంటుందో వేచి చూడాలి. ఇప్పటికే ఓటర్ జాబితా సిద్ధం కాగా.. కావాల్సిన బ్యాలెట్ బాక్సులు, సామగ్రి, ప్రింటింగ్ కూడా అధికారులు పూర్తిచేసి ఎన్నికలు ఎప్పుడు వచ్చినా నిర్వహించేందుకు సిద్ధంగా ఉన్నారు.

త్రిముఖ పోరు..

గడిచిన స్థానిక సంస్థల ఎన్నికల్లో అప్పుడు బీఆర్ఎస్ అధికారంలో ఉండగా.. మెజారిటీ స్థానాలను ఆ పార్టీనే దక్కించుకుంది. ఉమ్మడి పాలమూరు జిల్లాలో ఆ పార్టీకి సింహభాగం స్థానాలు దక్కాయి. వేరే పార్టీల్లో గెలిచిన వారు సైతం అప్పట్లో బీఆర్ఎస్‌లో చేరారు. అసెంబ్లీ ఎన్నికల సమయంలో కొంతమంది బీఆర్ఎస్‌ను వీడి కాంగ్రెస్‌లో చేరినప్పటికీ, ఇంకా బీఆర్ఎస్‌లో తాజా మాజీ ప్రజాప్రతినిధుల శాతం అధికంగానే ఉంది. గ్రామాల్లో ఇంకా ఆ పార్టీ కేడర్ బలంగా ఉండగా, అసెంబ్లీ, పార్లమెంట్ ఎన్నికల్లో గెలిచిన ఊపుతో ఉన్న కాంగ్రెస్ పార్టీ

(మిగతా 6లో..)

గతంలో బీసీల గెలుపు శాతమిది..

ప్రస్తుతం కాంగ్రెస్ ప్రభుత్వం బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని భావిస్తుండగా.. గతంలో రిజర్వేషన్లు తక్కువగా ఉన్న సమయంలోనూ బీసీలు జనరల్ స్థానాల్లో ఎక్కువ సీట్లు గెలుచుకున్నారు. ఒకవేళ బీసీలకు చట్టబద్ధంగా రిజర్వేషన్లు ఇవ్వలేని పక్షంలో పార్టీపరంగా 42 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని కాంగ్రెస్ గతంలో భావించింది. దానిపై కొంత విమర్శలు రావడంతో ఎలాగైనా చట్టబద్ధత కల్పించాలని భావిస్తోంది. ఈ విషయమై ఇప్పటికే కేబినెట్ తీర్మానం చేసింది. దాంతో ఆశావహులు పల్లెల్లో ముమ్మరంగా తిరుగుతున్నారు.

1,686 గ్రామ పంచాయతీలు

ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలో 1,686 పంచాయతీలు, 800 ఎంపీటీసీ, 77 జడ్పీటీసీ స్థానాలు ఉన్నాయి. గతంలో వనపర్తి జిల్లాలో 255 పంచాయతీలు ఉండగా.. ఇప్పుడు ఆ సంఖ్య 268కి చేరింది. ఏదుల నూతన మండలం ఏర్పాటు కావడంతో నాగర్‌కర్నూల్ జిల్లా కోడేరు మండలంలోని కొన్ని గ్రామాలను ఏదుల మండలంలో విలీనం చేశారు. అలాగే ఏదుల జడ్పీటీసీ స్థానం కూడా కొత్త మండల ఏర్పాటుతో పెరిగింది. జోగుళాంబ గద్వాల జిల్లాలో కూడా కొత్తగా ఎర్రవల్లి జడ్పీటీసీ స్థానం పెరిగింది. నారాయణపేట జిల్లాలో కొత్తపల్లి, గుండుమాల్ జడ్పీటీసీ స్థానాలు కొత్తగా అయ్యాయి. కొత్త మండలాలు, పంచాయతీలకు అనుగుణంగా ఓటర్ జాబితాను సిద్ధం చేశారు. కొన్ని కొత్తగా మునిసిపాలిటీలుగా ఏర్పడగా.. వాటి పరిధిలోకి కొన్ని పంచాయతీలను విలీనం చేయనున్నారు. వాటికి మునిసిపాలిటీలతో పాటే ఎన్నికలు జరగనున్నాయి.

ఫీజు రీయింబర్స్‌మెంట్ విడుదల చేయాలి

- ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్



కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహిస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు

నాగర్‌కర్నూల్‌టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ వెంటనే విడుదల చేయాలని ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్ డిమాండ్ చేశారు. సోమవారం ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో ఇంటర్, డిగ్రీ విద్యార్థులు కలెక్టరేట్ ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దామెర కిరణ్ మాట్లాడుతూ రాష్ట్రంలోని ఇంటర్, డిగ్రీ విద్యార్థులకు గత ఆరు సంవత్సరాలుగా రూ.8156 కోట్లు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్స్ పెండింగ్‌లో ఉన్నాయని పేర్కొన్నారు. రావాల్సిన ఫీజులు ఇవ్వకపోవడంతో ఇటు విద్యార్థులు ఇబ్బందులు పడుతుండగా, కళాశాలల యాజమాన్యాలు నిర్వహణ భారంతో అధ్యాపకులకు వేతనాలు చెల్లించటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. అనంతరం పలు డిమాండ్లతో కూడిన వినతిపత్రాన్ని కలెక్టరేట్‌లో అందజేశారు. ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి తారాసింగ్, ఉపాధ్యక్షుడు జమాలోద్దీన్, నాయకులు కార్తీక్, ధర్మభిక్షం, భాను, భాస్కర్, చందు, మహేష్, గణేష్, భరత్, రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

సీపీఆర్‌పై శిక్షణ ఇవ్వండి

- కలెక్టర్ ఆదర్శ్ సురభి



వైద్యశాఖ అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 14 (ఆంధ్రజ్యోతి): గుండెపోటు వచ్చినప్పుడు ప్రాణం రక్షించేందుకు తక్షణం చేయాల్సిన ప్రాథమిక వైద్యం సీపీఆర్ ఏ విధంగా చేయాలో శిక్షణ ఇవ్వాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి వైద్యశాఖ అధికారుల ను ఆదేశించారు. సోమవారం సాయంత్రం కలెక్టర్ తన ఛాంబర్‌లో వైద్యశాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ మధ్య గుండెపోటుతో అకస్మాత్తుగా ప్రాణాలు పోవడం చూస్తున్నామని, దీనిని నివారించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లాలో క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించి వైద్య పరీక్షలు అందించేందుకు చర్యలు తీసుకోవాలన్నారు. ఆగస్టు 15 నుంచి నోటి క్యాన్సర్, బ్రెస్టు క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వ్యాధిగ్రస్తులను గుర్తించేందుకు ఆశా వర్కర్ల ద్వారా ఇంటింటి సర్వే నిర్వహించాలని ఆయన ఆదేశించారు. క్షయవ్యాధి వల్ల 16 మంది చనిపోవడానికి కారణాలు ఏంటి?, వైద్యం అందిస్తున్నప్పటికీ ఎలా చనిపోయారు కారణాలు తెలుసుకునేందుకు ఆడిట్ నిర్వహించాలని డిప్యూటీ డీఎం అండ్ హెచ్‌వోను కలెక్టర్ ఆదేశించారు. జిల్లా వైద్య అధికారి డాక్టర్ శ్రీనివాస్, డిప్యూటీ వైద్యాధికారి డాక్టర్ శ్రీనివాస్, ప్రోగ్రాం అధికారి డాక్టర్ సాయినాథ్ రెడ్డి, డాక్టర్లు పరిమళ, రియాశ్రీ పాల్గొన్నారు.

నల్లమలలో పోలీసుల గాలింపు

- దొరకని ఆర్మీ జవాన్ ఆచూకీ 6



అదృశ్యమైన ఆర్మీ జవాన్ నవీన్(ఫైల్)

అదుపుతప్పిన స్కూల్ బస్సు 7

- దెబ్బ తిన్న ద్విచక్ర వాహనాలు

జల విద్యుత్ ఉత్పత్తి నిలిపివేత 6

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష 7

కొల్లాపూర్‌కు మహర్దశ

- రూ.200 కోట్లతో యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాలకు శంకుస్థాపన
- 18న జటప్రోలుకు రానున్న సీఎం రేవంత్‌రెడ్డి



కొల్లాపూర్ నియోజకవర్గానికి సీఎం రేవంత్‌రెడ్డిని ఆహ్వానిస్తున్న మంత్రి జూపల్లి కృష్ణారావు

కొల్లాపూర్/పెంట్లవెల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి): వలస జిల్లాలో వెనుకబడిన ప్రాంతంగా పిలువబడే కొల్లాపూర్ నియోజకవర్గానికి విద్యారంగంలో త్వరలో మహర్దశ రానుంది. తెలంగాణ రాష్ట్ర కాంగ్రెస్ ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా తలపెట్టిన ప్రాజెక్టుల



ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థలాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

లో ప్రధానంగా యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల ఒకటి. అన్ని వర్గాల పిల్లలను ఒకే గొడుగు కిందికి తెచ్చి అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యాబుద్ధులు నేర్పించాలనే లక్ష్యంతో కాంగ్రెస్ ప్రభుత్వం తీసుకున్న నిర్ణయం కొల్లాపూర్‌నియోజకవర్గంలోని పెంట్లవెల్లి మండలం జటప్రోలు గ్రామంలో అంకురార్పణ కానుంది. స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చేతుల మీదుగా యంగ్ ఇండియా సమీకృత గురుకుల పాఠశాల భవన నిర్మాణానికి శంకుస్థాపన చేయించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. రాష్ట్ర పర్యాటక, ఎక్సైజ్, సాంస్కృతిక, పురావస్తు శాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి కొల్లాపూర్ నియోజకవర్గానికి రావాల్సిందిగా ఆహ్వానం పలికారు. దీంతో ఈ నెల 18న కొల్లాపూర్ నియోజకవర్గం జటప్రోలు గ్రామానికి సీఎం రానున్నారని అధికారికంగా కలెక్టర్ బదావత్ సంతోష్ వెల్లడించారు.

కాగా, మారుమూల నియోజకవర్గమైన కొల్లాపూర్ విద్యార్థులకు 200 కోట్ల రూపాయలతో 25 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న గురుకుల క్యాంపస్ అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన డిజిటల్ విద్య, విద్యార్థులకు అందించేలా ప్రభుత్వం కార్యాచరణ రూపొందించింది. పాఠశాలలో విద్యార్థులకు అవసరమైన ప్రయోగశాలలో గ్రంథాలయాలు, మినీ యాంపి థియేటర్ క్రీడా ప్రాంగణం ఉండేలా డిజైన్ చేశారు.

పకడ్బందీగా ఏర్పాట్లు

ముఖ్యమంత్రి పర్యటనకు పూర్తి స్థాయిలో పకడ్బందీగా ఏర్పాటు చేస్తున్నామని కలెక్టర్ బదావత్ సంతోష్ అన్నారు. సోమవారం జటప్రోలు గ్రామంలో ఈ నెల 18న ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్న ఇంటిగ్రేటెడ్ పాఠశాల స్థలాన్ని కలెక్టర్ పరిశీలించారు. అదే విధంగా బహిరంగ సభకు అవసరమైన ఏర్పాట్లను స్వయంగా పరిశీలించి అధికారులకు అవసరమైన సలహాలు, సూచనలు చేశారు. కొల్లాపూర్ ఆర్డీవో భన్సీలాల్, ఎంపీడీవో దేవేందర్, తహసీల్దార్ విజయసింహ, అధికారులు, ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

బావిలో పడి మహిళ మృతి

వంగూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి): బావిలో పడి ఓ మహిళ మృతి చెందిన సంఘటన సోమవారం నాగర్‌కర్నూల్ జిల్లా వంగూరు మండలంలో చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం... వంగూరు మండలం ఉల్లంపల్లి గ్రామానికి చెందిన రాములమ్మ(42) ఈ నెల 12న ఇంటి నుంచి వెళ్లిపోయింది. కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం వెతికారు. సోమవారం సాయంత్రం గ్రామంలోని వారి ఇంటి వెనకాల ఉన్న బావిలో మృతదేహం లభించింది. దీంతో రాములమ్మ మృతి అనుమానాస్పదంగా మారింది. విషయాన్ని స్థానిక పోలీసులకు సమాచారం ఇవ్వడంతో వారు సంఘటనా స్థలానికి వచ్చి మృతదేహాన్ని బావిలో నుంచి తీయించారు. మృతదేహాన్ని కల్వకుర్తి ఆసుపత్రికి తరలించారు,

అడ్మిషన్లు ఇప్పిస్తానని మోసం

అలంపూరుచౌరస్తా, జూలై 14 (ఆంధ్రజ్యోతి): కేజీబీవీ పాఠశాలలో అడ్మిషన్లు ఇప్పిస్తానని ఓ వ్యక్తి విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేసిన ఘటన ఉండవల్లి మండలంలో చోటు చేసుకుంది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం... గద్వాల మండలం, తెలుగోనిపల్లి గ్రామానికి చెందిన తెలుగుపరుశ రాముడు, అదే గ్రామానికి చెందిన గువ్వలరాముడు అనే వ్యక్తులు ఇద్దరు గత నెల 20 ఉండవల్లి మండల పరిధిలోని కలుగొట్ల గ్రామంలోని కేజీబీవీ పాఠశాలలో అడ్మిషన్ల కోసం వచ్చారు. అక్కడ అలంపూరు పట్టణానికి చెందిన దివాకర్ అనే వ్యక్తి వీరితో పరిచయం చేసుకుని అడ్మిషన్లు ఇప్పిస్తానని పరుశరాముడు వద్ద రూ.18వేలు, రాముడు వద్ద నుంచి రూ.13వేలు, ఒరిజనల్ విద్యార్హత ధ్రువపత్రాలు తీసుకున్నాడు. ఇప్పుడు అప్పుడు అంటూ కాలయాపన చేసి దివాకర్ ఇటీవల ఫోన్లు చేసినా స్పందించకపోవడంతో సోమవారం ఉండవల్లి పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. బాధితులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై శేఖర్ తెలిపారు.

ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదులో అలసత్వం

- 35 మంది హెచ్ఎంలకు నోటీసులు

గద్వాల సర్కిల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : విద్యార్థుల ముఖ చిత్రంతో ఎఫ్ఆర్ఎస్ (ఫేస్ రికగ్నిషన్ సిస్టం)యాప్ ద్వారా హాజరు నమోదు చేసే విషయంలో అలసత్వం వహించిన జిల్లాలోని 35 మంది ప్రధానోపాధ్యాయులకు ఇన్‌చార్జి డీఈవో అబుల్ ఘని కలెక్టర్ ఆదేశానుసారం సోమవారం నోటీసులు జారీ చేశారు. ఎఫ్ఆర్ఎస్ హాజరు నమోదు చేసే విషయంలో నిర్లిప్తతకు గల కారణాలను రెండు రోజుల్లోగా వివరణ ఇవ్వాల్సిందిగా హెచ్ఎంలకు సూచించారు.



గ్రామస్థుల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

'రామన్నగట్టు' పనులు ప్రారంభించాలి

- ప్రజలను మభ్య పెడుతున్న ప్రభుత్వం
- మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

7

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

- కార్మిక వ్యతిరేక కోడ్లను రద్దు చేయాలి
- సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్కా రాములు

7



సమావేశంలో మాట్లాడుతున్న సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షులు చుక్కా రాములు

వర్షం కోసం.. ఎదురుచూపులు



- గద్వాల జిల్లాలో 14.3 శాతం తక్కువ వర్షపాతం
- 'పేట' జిల్లాలోని 10 మండలాల్లో లోటు..
- ఆందోళన చెందుతున్న రైతులు

లింగనవాయి గ్రామంలో వాడు పడుతున్న పత్తి పంట



వానల కోసం అన్నదాతలు ఎదురు చూపులతో కాలం గడుపుతున్నారు. ఈ ఏటా జూన్‌లో సమృద్ధిగా కురిసిన వాన కొంతమేర రైతులను సంతృప్తి పరిచింది.. ఆ వెనువెంటనే మొఖం చాటేయడంతో పరిస్థితి తారుమారైంది. వాతావరణ శాఖ అంచనాలు తప్పడంతో ఖరీఫ్‌లో ఇప్పటికే 80 శాతం విత్తనం విత్తాల్సి ఉండగా, 30శాతం కూడా విత్తని పరిస్థితి నెలకొన్నది. కాగా, ఓ వైపు విత్తనాలు వేసిన పంటలు వాడుముఖం పడుతుండగా.. మరోవైపు విత్తేందుకు పొలాలను సిద్ధం చేసుకొన్న రైతులు వర్షం కోసం ఎదురు చూస్తుండటం గమనార్హం. ఈ నేపథ్యంలో వరుణ దేవా కరుణించు అంటూ వేడుకుంటూ గంగాజలంతో పూజలు చేస్తున్నారు.

7

- గద్వాల/నారాయణపేట(ఆంధ్రజ్యోతి)

బాలకార్మికులకు విముక్తి


పాల్వాయిలో బాలకార్మికుడితో మాట్లాడుతున్న అధికారులు

మల్దకల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : గొర్రెల కాపరులుగా పని చేస్తున్న ముగ్గురు బాలలకు అధికారులు విముక్తి కల్పించారు. ఆపరేషన్ ముస్కాన్ కార్యక్రమంలో భాగంగా జోగుళాంబ గద్వాల జిల్లాలో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ, జిల్లా బాలల పరిరక్షణ విభాగం అధికారులు సోమవారం తనిఖీలు నిర్వస్తున్నారు. సోమవారం మల్దకల్ మండల పరిధిలోని ఎల్కూర్, పాల్వాయి, బూడిదపాడు గ్రామాల్లో గొర్రెలను మేపేందుకు వెళ్తున్న బాలకార్మికులను గుర్తించి వివరాలు సేకరించారు. వారిని గద్వాల బాలల పరిరక్షణ కమిటీ ముందు హాజరు పరిచారు.

ఉత్తమ ఉపాధ్యాయ అవార్డుకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జాతీయ స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ అవార్డులకు ఈనెల 17 వరకు దరఖాస్తు చేసుకోవాలని డీఈవో ప్రవీణ్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. సోమవారంతో ముగిసిన గడువును ఈనెల 17వరకు పొడిగించడం జరిగిందని, 16లోపు నామినేషన్స్ పొందుపరిచి మరుసటి రోజున ఇవ్వాలని తెలిపారు. ప్రభుత్వ, లోకల్‌బాడి, గురుకులాలు, మోడల్‌స్కూల్, కేంద్రీయ, నవోదయ పాఠశాలల్లో పనిచేస్తూ ఐదేళ్ల సర్వీస్ పూర్తి చేసుకున్న ఉపాధ్యాయులు అర్హులని తెలిపారు.

ఇంజమ్మవ్వ ఆలయంలో చోరీకి యత్నం

» దొంగను పట్టుకున్న గ్రామస్థులు

గట్టు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఆలయంలో చోరీకి యత్నించిన ఓ వ్యక్తి గ్రామస్థులకు దొరికిపోయాడు. జోగుళాంబ గద్వాల జిల్లా, గట్టు మండలంలోని ఇందువాసి గ్రామంలో సోమవారం ఈ సంఘటన జరిగింది. గ్రామస్థులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామ సమీపంలోని కొండపై ఇంజమ్మవ్వ ఆలయంలోకి సోమవారం మధ్యాహ్నం ఓ వ్యక్తి ప్రవేశించాడు. వెంట తెచ్చుకున్న స్క్రూడ్రైవర్‌తో హుండీని తెరిచేందుకు యత్నించాడు. సాధ్యం కాకపోవడంతో రాయితో హుండీని ధ్వంసం చేస్తుండగా ప్రయత్నించాడు. ఆ శబ్దాన్ని చుట్టుపక్కల పొలాల్లో ఉన్న రైతులు ఆలయం వద్దకు చేరుకున్నారు. హుండీని పగులగొట్టేందుకు యత్నిస్తున్న యువకుడిని గమనించి ఆలయం తలుపులు మూసి తాళం వేశారు. గ్రామస్థులకు సమాచారం ఇవ్వడంతో వారు అక్కడికి చేరుకొని పోలీసులకు ఫోన్‌చేశారు. దీంతో వారు వచ్చి నిందితుడిని స్టేషన్‌కు తీసుకెళ్లారు. ఈ సంఘటనకు సంబంధించిన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి.

క్లిక్ చేస్తే... రూ. లక్ష మాయం

జడ్చర్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఓ వ్యక్తి సోషల్ మీడియా గ్రూప్‌లో వచ్చిన ఓ లింక్‌ను క్లిక్ చేయడంతో అతడి ఖాతాలోనుంచి లక్ష రూపాయలు మాయం అయ్యాయి. మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల సీఐ కమలాకర్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జడ్చర్ల పట్టణంలోని బాలాజీనగర్‌కు చెందిన వ్యాపారి అంజుమ్‌అలీ మొబైల్ ఫోన్‌లో ఓ సోషల్ మీడియా గ్రూప్‌నకు పీఎం కిసాన్ యోజన పేరుతో ఏపీకే ఫైల్ వచ్చింది. దాన్ని క్లిక్ చేయడంతో అతడి సెల్‌ఫోన్‌ను సైబర్ నేరగాళ్లు హ్యాక్ చేశారు. అతడి ఖాతాలో నుంచి రెండు విడతలుగా రూ. లక్ష కాజేసారు. బ్యాంకు నుంచి డబ్బులు డ్రా అయినట్లుగా ఫోన్‌కు మెసేజ్ రావడంతో మోసపోయినట్లుగా గుర్తించాడు. వెంటనే సైబర్ క్రైమ్‌కు, సోమవారం జడ్చర్ల పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు.

కల్లు విక్రయాలపై దాడులు

» నలుగురిపై కేసు నమోదు

గద్వాల క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రంలోని పలు కాలనీలలో కల్లు బయటినుండి తెచ్చి విక్రయిస్తున్న వారిపై రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్, డీటీఎఫ్ అధికారులు సోమవారం రాత్రి దాడులు నిర్వహించి కేసులు నమోదు చేసినట్లు ఎక్సైజ్ సిఐ గణపతిరెడ్డి తెలిపారు. ఇందుకు సంబంధించి ఆయన తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జిల్లా కేంద్రంలోని చింతలపేట, బీసీ కాలనీలో కల్లు విక్రయిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడులు నిర్వహించి వెంకటేష్, కృష్ణ, పద్మమ్మ, వెంకట్రాములు పై నాలుగు కేసులు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు. ఈ దాడులలో పలు కల్లు ప్యాకెట్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ దాడుల్లో రాష్ట్ర ఎక్సైజ్ టాస్క్‌ఫోర్స్ సిబ్బంది, జిల్లా టాస్క్‌ఫోర్స్ ఎస్ఐ శ్రీకాంత్‌రెడ్డి, గద్వాల ఎక్సైజ్ ఎస్ఐ వీరేషలింగం ఉన్నారు.

ప్రోత్సాహకాలు కరువాయె..!

» కులాంతర వివాహాలు చేసుకున్న వారిపై అధికారుల వివక్ష
» 2011లో ఇచ్చిన ప్లాట్ల పట్టాలకు నేటికీ స్థలం చూపని వైనం
» 176 మంది జంటలకు సర్వే నెంబరు 974లో స్థలం కేటాయింపు
» ఏళ్ల తరబడి కార్యాలయాల చుట్టూ తిరిగినా ప్రయోజనం వృథా
» లబ్ధిదారులకు అందని ద్రాక్షగా ప్రభుత్వ ఆర్థిక సాయం



వనపర్తి టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : సమాజంలో నేటికి ఇంకా అక్కడక్కడ కుల రక్కసి తాండవిస్తూనే ఉంది. కుల వివక్షను పారద్రోలడానికి ప్రభుత్వాలు అనేక అవగాహన కార్యక్రమాలు చేపడుతూ... ప్రజల్లో చైతన్యం కలిగించేందుకు కృషి చేస్తున్నాయి. అందులో భాగంగానే కులాంతర, మతాంతర వివాహాలు చేసుకున్న జంటలను ప్రోత్సహిస్తూ.. ప్రభుత్వ పరంగా ఆర్థికంగా ఆదుకుంటున్నారు. కానీ కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ప్రభుత్వం అందజేస్తున్న ప్రోత్సాహకం ఏళ్లుగా అందడం లేదు. సాంఘిక సంక్షేమ శాఖ కార్యాలయంలో దరఖాస్తు చేసి కార్యాలయం చుట్టూ తిరిగి నిరాశ, నిస్పృహలకు గురై ఆశలు వదులుకుంటున్నారు. 2011లో కులాంతర వివాహాలు చేసుకున్న జంటలకు ఆనాటి నాయకులు, అధికారులు ఇంటి స్థలాల కోసం 176 మందికి పట్టా సర్టిఫికెట్లు ఇచ్చి చేతులు దులుపుకున్నారు. పట్టాలు ఇచ్చి నేటికి స్థలం ఇవ్వకపోవడంతో ఆదర్శ వివాహాలు చేసుకున్న సభ్యులు తమను ప్రభుత్వాలు, అధికారులు పట్టించుకోవడం లేదనే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

పీర్లగుట్ట స్థలంలో

కులాంత వివాహం చేసుకున్న సభ్యులు ఒక గ్రూపుగా ఏర్పడి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం ఉన్నప్పుడే ఆదర్శ కులాంతర వివాహితుల సంక్షేమ సమితిని నిర్మించుకున్నారు. అందులో దాదాపు వందల సంఖ్యలో సభ్యులు ఉండి ప్రభుత్వ పరంగా త మను ఆర్థికంగా ఆదుకోవాలని, ఇంటి స్థలాల కోసం దరఖాస్తులు చేసుకున్నారు. దీంతో అప్పట్లో ఆనాటి నాయకులు పీర్లగుట్ట ప్రాంతంలోని సర్వే నెంబరు 974లో ఇంటి స్థలాలు ఇస్తున్న ట్లుగా తహసీల్దార్ చేతుల మీదుగా 176 మందికి పట్టాలు ఇచ్చారు. కానీ పట్టాకు సంబంధించి హద్దులు చూపించకపోవడంతో లబ్ధిదారులు కార్యాలయం చుట్టూ తిరిగి వేసారి నిరాశతో గమ్మునుండిపోయారు. అంతే కాకుండా వీరిలో కొందరికి 2001లో ఆనాటి ఎంపీ మంద జగన్నాథం, మంత్రి నాగం జనార్ధన్‌రెడ్డి చేతుల మీదుగా ఉమ్మడి మహబూబ్‌నగర్‌లో ఒక్కక్కరికి రూ.10 వేల క్యాష్ ప్రైజ్ కూడా అందించి ప్రోత్సహించారు. ఇంటి స్థలాలు మాత్రం పట్టాలకే పరిమితమయ్యాయి. ఆదర్శ కులాంతర వివాహితుల సమితి నుంచి కాకుండా కొందరు రాజకీయ పలుకుబడితో స్వయంగా పైరవీలు చేసుకుని ఇంటి స్థలాలు, ఆర్థిక నగదు పొందిన వారు కూడా ఉన్నారు. కానీ 176 మందికి మాత్రం పట్టాలతోనే సరిపెట్టడంతో కనీసం నేటి కాంగ్రెస్ ప్రభుత్వంలోనైనా తమకు ఇచ్చిన పట్టాలకు ఇంటి స్థలం చూపిస్తారనే ఆశతో ఎదురు చూస్తున్నారు.

ఎమ్మెల్యే, కలెక్టర్ చొరవ చూపాలి..



నేను దళిత కుటుంబానికి చెందిన వ్యక్తిని. నా భార్య బీసీ కులానికి చెందిన అమ్మాయి. ఇద్దరం ఇష్టపూర్తిగా 2000 సంవత్సరంలో వివాహం చేసుకున్నాం. ప్రస్తుతం నాకు ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. అప్పటి నుంచి ఇంటి స్థలం కోసం ప్రభుత్వానికి దరఖాస్తు చేసుకోగా 2011లో పట్టా సర్టిఫికెట్ ఇచ్చారు. కానీ హద్దులు చూపి స్థలం కేటాయించలేదు. ఎన్నో ఏళ్లుగా ప్రభుత్వ కార్యాలయం చుట్టూ తిరిగి అలసిపోయాను. కనీసం ఇప్పటి ప్రజా ప్రభుత్వంలోనైనా ఎమ్మెల్యే మేఘారెడ్డి, కలెక్టర్ ఆదర్శ్ సురభి మాపై ప్రత్యేక శ్రద్ధ చూపి ఇంటి స్థలాలు ఇస్తారని ఆశగా ఎదురుచూస్తున్నాం.

- గంధం శ్రీనివాసులు, కులాంతర వివాహం చేసున్న వ్యక్తి, వనపర్తి

అందరి దృష్టి.. స్థానికంపైనే

(5వ పేజీ తరువాయి)

కేడర్‌ను బలోపేతం చేసుకోవడం వంటి పరిణామాలతో పోటీ హోరాహోరీగా ఉండనుంది. బీసీలకు రిజర్వేషన్లు ఇచ్చామనే అంశంతో కాంగ్రెస్ ముందుకు వెళ్లనుంది. గ్రామాలు, పట్టణాల్లో ఇటీవలి కాలంలో సీసీ రోడ్లు, డ్రైనేజీలను ఎక్కువ సంఖ్యలో నిర్మించడం, సన్న బియ్యం పథకం వంటి అంశాలు తమకు కలిసి వస్తాయని ఆ పార్టీ భావిస్తోంది. అలాగే బీఆర్ఎస్ తమకున్న కేడర్, గతంలో చేసిన పనులు, ప్రభుత్వ వ్యతిరేకత కలిసి వస్తుందని అభిప్రాయపడుతోంది. ఇప్పటికే ఆయా పార్టీల ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు తరచూ పార్టీ సమావేశాలు నిర్వహిస్తూ దిశానిర్దేశం చేస్తున్నారు. బీసీ రిజర్వేషన్లు అమలయ్యే పక్షంలో తమ వ్యూహాలను మార్చుకునే అవకాశం ఉంది. ఇక గతంలో ఎన్నడూ లేనంతగా బీజేపీ కూడా స్థానిక సంస్థల ఎన్నికలపై దృష్టి పెట్టింది. ప్రత్యామ్నాయ పార్టీగా ఎదగడానికి స్థానిక సంస్థల ఎన్నికలు గేట్‌వేగా ఉంటాయని ఆ పార్టీ నాయకత్వం అనుకుంటోంది. పార్లమెంట్ ఎన్నికల్లో వచ్చిన ఓటు బ్యాంకును సద్వినియోగం చేసుకుని.. సరైన అభ్యర్థులను నిలిపితే ఫలితం ఉంటుందని నాయకులు అభిప్రాయ పడుతున్నారు. అయితే పంచాయతీలను పార్టీ గుర్తుపై కాకుండా ఇతర గుర్తులపై గెలుచుకోవాల్సి ఉంటుంది. పరిషత్ ఎన్నికల్లో మాత్రం పార్టీ గుర్తులు ఉంటాయి. కాబట్టి కాంగ్రెస్ పార్టీ ముందుగా పరిషత్ ఎన్నికలను నిర్వహించి, ప్రభుత్వ పనితీరుకు గెలుపు అని చెప్పాలని భావిస్తోంది.

గతంలో బీసీ రిజర్వేషన్లు, జనరల్ స్థానాల్లో బీసీలు గెలిచిన సీట్లు ఇలా..

స్థానిక సంస్థలు	మహబూబ్ నగర్	నాగర్‌కర్నూల్	గద్వాల	వనపర్తి	నారాయణపేట
మొత్తం పంచాయతీలు	439	461	255	255	280
బీసీలకు కేటాయించిన స్థానాలు	97	83	80	62	84
జనరల్ స్థానాల్లో బీసీలు గెలిచినవి	61	37	55	38	47
బీసీలు మొత్తం గెలిచిన స్థానాలు	158	120	135	100	131
మొత్తం ఎంపీటీసీ స్థానాలు	169	210	141	128	140
బీసీలకు కేటాయించిన స్థానాలు	35	49	44	37	52
జనరల్ స్థానాల్లో బీసీలు గెలిచినవి	30	21	30	20	24
బీసీలు మొత్తం గెలిచిన స్థానాలు	65	70	74	57	76
మొత్తం జడ్పీటీసీ స్థానాలు	14	20	12	14	11
బీసీలకు కేటాయించిన స్థానాలు	3	3	5	5	4
జనరల్ స్థానాల్లో బీసీలు గెలిచినవి	0	4	1	0	1
బీసీలు మొత్తం గెలిచిన స్థానాలు	3	7	6	5	5

నల్లమలలో పోలీసుల గాలింపు

» దొరకని ఆర్మీ జవాన్ ఆచూకీ


ఈగలపెంటలో మత్స్యకారులతో మాట్లాడుతున్న పోలీసులు

దోమలపెంట, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అదృశ్యమైన ఆర్మీ జవాన్ కోసం పోలీసులు నల్లమల అడవిలో విస్తృతంగా గాలిస్తున్నారు. నాగర్‌కర్నూల్ జిల్లా, ఈగలపెంట ఎస్ఐ జయన్న తెలిపిన వివరాల ప్రకారం... మహబూబాబాద్ జిల్లా, మరిపెడ మండలం, గిపురం శివారు పూసలతండాకు చెందిన ఆర్మీ జవాన్ మూడ్ నవీన్ సెలవుపై గత నెల 28న స్వగ్రామానికి వచ్చాడు. విధుల్లో చేరేందుకు వెళ్తున్నానని చెప్పి ఈనెల 10న కుటుంబ సభ్యులకు చెప్పి తండా నుంచి కారులో బయలుదేరాడు. ఆ తర్వాత కుటుంబ సభ్యులు ఎన్నిసార్లు అతడి మొబైల్‌కు ఫోన్ చేయగా, స్పందించలేదు. దీంతో వారు అక్కడి పోలీసులకు ఫిర్యాదు చేశారు. వారు సెల్‌ఫోన్ సిగ్నల్ ఆధారంగా విచారణ చేయగా, అమ్రాబాద్ మండలం కృష్ణానది ఒడ్డున ఉన్నట్లు గుర్తించారు. దీంతో వారు ఆదివారం బాధిత కుటుంబ సభ్యులతో కలిసి వచ్చి వెతకగా శ్రీశైలం డ్యాం సమీపంలో కారు కనిపించింది. దీంతో నదీ తీరంతో, సమీప ప్రాంతాల్లో గాలింపు కొనసాగించారు. మత్స్యకారులతో మాట్లాడి విషయాన్ని తెలిపి ఆరా తీశారు. ఈ సందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ మూడు రోజులుగా నల్లమలలోని కృష్ణాతీరం వెంట గాలిస్తున్నామని, ఇప్పటివరకు ఆచూకీ అభించలేదని తెలిపారు.

జల విద్యుత్ ఉత్పత్తి నిలిపివేత

ఆత్మకూరు, జూలై 14(ఆంధ్రజ్యోతి) : ఎగువ నుంచి వరద తగ్గిపోవడంతో జూరాల ప్రాజెక్టు ఎగువ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తిని పూర్తిగా నిలిపివేసినట్లు ఎస్ఈ శ్రీధర్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. తెలిపారు. ఎగువ నుంచి వరద 30 వేల క్యూసెక్కులకు తగ్గిందని పేర్కొన్నారు. దీంతో ఎగువ విద్యుత్ కేంద్రంలో ఉత్పత్తిని పూర్తి నిలిపివేసి, దిగువ విద్యుత్ కేంద్రంలో ఒక యూనిట్ ద్వారా మాత్రమే ఉత్పత్తి కొనసాగిస్తున్నట్లు తెలిపారు.

జాతీయ స్థాయి పోటీలకు ఎంపిక


సౌత్‌జోన్ జాతీయ స్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులు

మక్తల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : సౌత్‌జోన్ జాతీయ స్థాయి సైకింగ్ పోటీలకు 30 మంది విద్యార్థులు ఎంపికయ్యారని సైక్లింగ్ అసోసియేషన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గోపాలం తెలిపారు. మక్తల్ పట్టణంలో ఈ నెల 13న ఉమ్మడి జిల్లా స్థాయి మహిళలు, బాలికలకు సైక్లింగ్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. ఈ పోటీల్లో 130 మంది మహిళలు, బాలికలు పాల్గొన్నారని తెలిపారు. వారిలో ప్రతిభ కనబర్చిన 30 మందిని జాతీయ స్థాయికి ఎంపిక చేసినట్లు చెప్పారు. వారు ఈ నెల చివరి వారంలో హైదరాబాద్‌లో నిర్వహించనున్న పోటీల్లో పాల్గొంటారని తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను సైక్లింగ్ జిల్లా కోశాధికారి, పీడీ రూప, నిర్వాహకులు అంబ్రేష్, రమేశ్‌కుమార్, దామోదర్ తదితరులు అభినందించారు.

క్రీడాకారుల కల సాకారం

» నేడు ప్రారంభం కానున్న వాలీబాల్ అకాడమీ
» 15 మంది బాలురు, 12 మంది బాలికల ఎంపిక


వాలీబాల్ అకాడమీలో క్రీడాకారుల కోసం ఏర్పాటు చేసిన బెడ్లు

మహబూబ్‌నగర్ స్పోర్ట్స్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : వాలీబాల్ క్రీడాకారుల చిరకాల వాంఛ నెరవేరుతున్నది. మహబూబ్‌నగర్ పట్టణంలోని జిల్లా క్రీడా ప్రాధికార సంస్థ (డీఎస్ఏ) మైదానంలో మంగళవారం ప్రారంభం కానున్నది. అయితే ఈ అకాడమీని రెండేళ్ల క్రితమే అప్పటి రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. మహబూబ్‌నగర్ స్టేడియంలో క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను కూడా నిర్వహించారు. ప్రతిభ చూపిన బాల బాలికలను ఎంపిక చేశారు. కానీ అకాడమీని మాత్రం ప్రారంభించలేదు. తాజాగా రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారుడు ఏపీ జితేందర్‌రెడ్డి ప్రత్యేక దృష్టి సారించడంతో అకాడమీ ప్రారంభానికి ఏర్పాట్లు పూర్తయ్యాయి. గత నెలలో క్రీడాకారుల ఎంపిక ప్రక్రియను నిర్వహించారు. ప్రతిభ కనబరిచిన 15 మంది బాలురు, 17 మందిని బాలికలు, మొత్తం 32 మందిని అకాడమీకి ఎంపిక చేశారు. నేటి నుంచి ప్రారంభం కానుండటంతో క్రీడాకారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.


పూర్తయిన ఏర్పాట్లు

వాలీబాల్ అకాడమీ ఏర్పాటుకు ప్రభుత్వం రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ(శాట్స్) ద్వారా రూ. 19 లక్షలు విడుదల చేసింది. వాటితో మైదానంలో రెండు వాలీబాల్ కోర్టులను సిద్ధం చేశారు. ప్లే ఫీల్డు గోడలకు వర్ణ చిత్రాలు వేశారు. క్రీడాకారులకు వసతి కోసం ఈత కొలను పైఅంతస్తులోని గదులకు మరమ్మతులు చేశారు. పెయింటింగ్ వేసి రూంలను సిద్ధం చేశారు. అలాగే రూ.3.70 లక్షల విలువైన వంట సామగ్రి, రూ. 3 లక్షల పైచిలుకు వ్యయంతో మంచాలు, పరుపులు, దుప్పట్లు, డైనింగ్ టేబుళ్లను ఏర్పాటు చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం, రాత్రి పౌష్టికాహారం అందించనున్నారు. బాల, బాలికలకు శిక్షణ ఇచ్చేందుకు ప్రత్యేక కోచ్‌లను నియమించనున్నారు.

అకాడమీలో శిక్షణ ఇలా...

వాలీబాల్ అకాడమీకి ఎంపికైన క్రీడాకారులకు నిష్ణాణుతుల కోచ్‌ల పర్యవేక్షణలో వివిధ అంశాల్లో శిక్షణ ఇస్తారు. సర్వీసింగ్, పాసింగ్, సెట్టింగ్, స్పైకింగ్, బ్లాకింగ్ వంటి ప్రాథమిక అంశాల్లో నైపుణ్యం పెంపునకు సాధన చేయిస్తారు. ఎలా ఆడాలి, వ్యూహాలను ఎలా ఉపయోగించాలి. జట్టు సభ్యులతో సమన్వయంపై అవగాహన కల్పిస్తారు. అలాగే బలం, వేగం, ఓర్పు తదితర శారీరక లక్షణాల అభివృద్ధికి శిక్షణ ఇస్తారు. అలాగే ఆటగాళ్లు ఒత్తిడిని ఎలా ఎదుర్కోవాలి, ఏకాగ్రతను ఎలా నిలుపుకోవాలి, ఆత్మవిశ్వాసాన్ని ఎలా వృద్ధి చేసుకోవాలో నేర్పిస్తారు. క్రీడాకారులు బలం, బలహీనతలను గుర్తించేలా మార్గదర్శకత్వం చేస్తారు. ఇదే క్రమంలో రాష్ట్ర, జాతీయ స్థాయి పోటీల్లో పాల్గొనేందుకు అవసరమైన శిక్షణ ఇస్తారు.

నిష్ణాతుల పర్యవేక్షణలో శిక్షణ



రాష్ట్ర వాలీబాల్ అకాడమీ నేడు ప్రారంభం కానున్నది. రాష్ట్ర ప్రభుత్వ క్రీడా సలహాదారు ఏపీ జితేందర్‌రెడ్డి కృషితో అకాడమీ అందుబాటులోకి వచ్చింది. స్పోర్ట్స్ అథారిటీ ఛైర్మన్ శివసేనా సేనరెడ్డి, స్పోర్ట్స్ అథారిటీ అధికారులకు కృతజ్ఞతలు. ఎంపికైన బాలబాలికలకు నిష్ణాతులైన శిక్షకుల పర్యవేక్షణలో శిక్షణ ఇస్తాం.

-ఎస్. శ్రీనివాస్, డీవైఎస్‌వో, మహబూబ్‌నగర్

ఇసుక ట్రాక్టర్ పట్టివేత

మిడ్జిల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నట్లు మిడ్జిల్ ఎస్ఐ శివనాగేశ్వర్‌నాయుడు తెలిపారు. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండల కేంద్రం శివారులు రెండు రోజుల క్రితం ఇసుకను అక్రమంగా తరలిస్తున్న ట్రాక్టర్‌ను పట్టుకున్నారు. దాన్ని స్టేషన్‌కు తీసుకురావాలని డ్రైవర్‌కు చెప్పిన పోలీసులు తమ వాహనంలో ముందుగా బయలు దేరారు. అయితే డ్రైవర్ ట్రాక్టర్‌ను తీసుకొని అక్కడి నుంచి పరారయ్యాడు. దీనిపై విచారణ చేపట్టిన పోలీసులు సోమవారం ట్రాక్టర్ ఆచూకీ తెలుసుకొని స్టేషన్‌కు తీసుకొచ్చారు. నిందితుడిపై కేసు నమోదు చేశారు.

స్వాతంత్ర్య పోరాటంలో మైనార్టీల పాత్ర

» ఆవాజ్ కమిటీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్
» ముగిసిన ఆవాజ్ కమిటీ రాష్ట్ర మహాసభలు



ఆవాజ్ కమిటీ రాష్ట్ర మహాసభల్లో మాట్లాడుతున్న కార్యదర్శి ఎండీ అబ్బాస్

గద్వాల టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : దేశ స్వాతంత్ర్య పోరాటంలో మైనార్టీలు పోషించిన పాత్రను ఎవరూ మరచిపోలేరని ఆవాజ్ కమిటీ రా ష్ట్ర ప్రధాన కార్యదర్శి ఎండీ అబ్బాస్ అన్నారు. చా రిత్రక పోరాటాలను వక్రీకరించి మతం రంగు పులి మే ప్రయత్నాలను సమాజం ఎన్నటికీ హర్షించద న్నారు. ఆవాజ్ కమిటీ రాష్ట్ర మూడవ మహాసభలు సోమవారం రెండవ రోజు ముగిశాయి. ఈ సంద ర్భంగా ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో 'భారత స్వాతం త్ర్య ఉద్యమం - మైనార్టీల పాత్ర' అనే అంశంపై సె మినార్ నిర్వహించారు. ప్రధాన ఉపన్యాసం చేసిన అబ్బాస్ సరిహద్దు గాంధీగా పేరు పొందిన ఖాన్‌అ బ్దుల్ గఫార్ ఖాన్, టిప్పుసుల్తాన్ వంటి యోధుల తో పాటు ఆవాదీ బానుబేగం, హజరా బేగం వంటి నారీమణులు సమరయోధుల పిలుపునందుకొని తమ ఉద్యోగాలను సైతం వదులుకొని ఉద్యమంలో పాల్గొని ఆస్తులను సమాజానికి ధారబోసిన ఉదంతాలు ఉన్నాయన్నారు. తెలంగాణ సాయుధ రైతాంగ పోరాటంలోనూ నిజాం నవాబుకు వ్యతిరేకంగా సోయబుల్లా ఖాన్, షేక్ బందగీ వంటి వీరులు ప్రాణాలను సైతం కోల్పోయిన విషయం మరువరాదన్నారు. స్వాతంత్ర్య పోరాటంలో ఎన్నడూ పాల్గొనని బీజేపీ, ఆర్ఎస్ఎస్‌లు చారిత్రక పోరాటానికి మతం రంగు పులుముతూ మైనార్టీల దేశభక్తి గురించి మాట్లాడటం హాస్యాస్పదమన్నారు. ఆర్ఎస్ఎస్ నిత్యం పూజించే సావార్కర్, గోల్వాల్కర్ వంటి నాయకులు ఈస్ట్ ఇండియా కంపెనీకి అనుకూలంగా బ్రిటీష్ వారి అడుగుజాడల్లో నడిచింది వాస్తవం కాదా అని ప్రశ్నించారు. ఒక దశలో జాతీయ పతాకాన్ని సైతం అంగీకరించని వీరు మైనార్టీల దేశభక్తి గురించి మాట్లాడటం దౌర్భాగ్యమన్నారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన స్వాతంత్ర్య సమరయోధుల ఎగ్జిబిషన్‌ను రిటైర్డ్ ప్రిన్సిపాల్ జలీల్ ప్రారంభించారు. అనంతరం జలీల్ మాట్లాడుతూ పోరాట యోధుల చరిత్రను అధ్యయనం చేయడం ద్వారా విద్యార్థులు, యువకుల్లో దేశభక్తి పెంపొందుతుందన్నారు. మహాసభలను చివరిరోజు ఆవాజ్ కమిటీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అతిక్‌ఉర్ రెహమాన్ జెండాను ఎగురవేసి ప్రారంభించగా, బీఆర్ఎస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి నాగర్‌దొడ్డి వెంకట్రాములు, సీపీఐ, సీపీఎం జిల్లా కార్యదర్శులు ఆంజనేయులు, వెంకటస్వామి, పాలమూరు అధ్యయన వేదిక జిల్లా కన్వీనర్ ఇక్బాల్ బాషా తమ ప్రసంగాల్లో దేశసమైక్యత, సమగ్రత, మతసామరస్యం గురించి తమ సందేశాలు వినిపించారు. మహాసభల్లో నాయకులు ఎండీ జబ్బార్, కురువ పల్లయ్య, రంగు మద్దులేటి, తాహేర్, ఆంజనేయులు, సునంద్, వివి నరసింహ, ఉప్పేరు నరసింహ పాల్గొన్నారు.

క్రైం కార్నర్

గుర్తు తెలియని వాహనం ఢీకొని వ్యక్తి మృతి

బాలానగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : గుర్తు తెలియని వాహనం ఢీకొని ఓ వ్యక్తి మృతి చెందాడు. మహబూబ్‌నగర్ జిల్లా, బాలానగర్ మండల కేంద్రంలో ఈ సంఘటన జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మహబూబ్‌నగర్ పట్టణంలోని షాషాబ్‌గుట్ట ప్రాంతానికి చెందిన బోల రాజ శేఖర్ (36) అనే వ్యక్తి తన స్నేహితుడు మహేశ్‌కు చెందిన ద్విచక్రవాహనాన్ని తీసుకొని ఆదివారం రాత్రి 12.30 గంటల సమయంలో షాద్‌నగర్ కు బయలుదేరాడు. మార్గంమధ్యలో నేవాపాన్ పరిశ్రమ వద్దకు రాగానే గుర్తు తెలియని వాహనం వెనుక వైపు నుంచి ఢీకొట్టింది. ప్రమాదంలో రాజశేఖర్ అక్కడికక్కడే మృతి చెందాడు. సమాచారం అందుకున్న పోలీసులు సంఘటన స్థలాన్ని పరిశీలించి, మృతదేహాన్ని జడ్చర్ల ప్రభుత్వ ఆ సుపత్రికి తరలించారు. మృతుడి భార్య సుహాసిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ లెనిన్‌గౌడ్ తెలిపారు.

ఆర్డీఎస్ కాలువలో మృతదేహం లభ్యం

అలంపూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అలంపూర్ మండల పరిధిలోని క్యాతూరు శివారులో ఉన్న ఆర్డీఎస్ కాలువలో గుర్తుతెలియని వ్యక్తి మృతదేహం లభ్యమైంది. ఎస్‌ఐ వెంకటస్వామి తెలిపిన వివరాలిలా ఉన్నాయి. సోమవారం పొలం పనులపై వెళ్తున్న రైతులకు కాలువలో మృతదేహం కనిపించడంతో పోలీసులకు సమాచారం అందించారు. వారు సంఘటన స్థలానికి చేరుకొని పరిశీలించారు. మృతుడి వయసు 50 నుంచి 60 ఏళ్లు ఉండొచ్చని తెలిపారు. వివరాలు తెలిసిన వారు సమాచారం ఇవ్వాలని ఎస్‌ఐ కోరారు.

డ్రైనేజీలో మరో వ్యక్తి శవం..

కొత్తకోట (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా, కొత్తకోట పట్టణం లోని పశువైద్యశాల సమీపంలోని డ్రైనేజీలో గుర్తు తెలియని వ్యక్తి (40) మృతదేహం లభ్యమైంది. స్థానికులు గమనించి పోలీసులకు సమాచారం అందించారు. దీంతో వారు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని జిల్లా ఆసుపత్రికి తరలించారు. ఆదివారం రాత్రి డ్రైనేజీలో పడి ఉండొచ్చని ఎస్‌ఐ ఆనంద్ తెలిపారు.

అదుపుతప్పిన స్కూల్ బస్సు

» దెబ్బ తిన్న ద్విచక్ర వాహనాలు



బస్సు ఢీకొనడంతో కిందపడిన ద్విచక్ర వాహనాలు

అయిజ టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జోగుళాంబ గద్వాల జిల్లా, అయిజ పట్టణంలో ఓ స్కూల్ బస్సు అదుపు తప్పి ద్విచక్రవాహనాలపైకి దూసుకెళ్లడంతో అవి దెబ్బతిన్నాయి. స్థానికులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. అయిజ పట్టణంలోని ఓ ప్రైవేట్ పాఠశాలకు చెందిన బస్సు సాయంత్రం 4.30 గంటల సమయంలో విద్యార్థులను ఎక్కించుకొని పట్టణంలోకి బయలుదేరింది. తెలంగాణ చౌరస్తాలో బస్సు అదుపుతప్పి రోడ్డు పక్కనే ఉన్న ద్విచక్రవాహనాలపైకి దూసుకెళ్లింది. దీంతో రెండు బైక్‌లు కిందపడిపోయాయి. మరో ద్విచక్ర వాహనం బస్సు కింద పడింది. అయితే బైక్‌లపై ఉన్న వ్యక్తులు అప్రమత్తమై పక్కకు తప్పుకోవడంతో ప్రాణాపాయం తప్పింది. బస్సు బ్రేకులు ఫెయిల్ కావడం వల్లే ప్రమాదం జరిగిందని స్థానికులు చెప్తున్నారు.

వేర్వేరు చోట్ల ముగ్గురి అదృశ్యం

ఊట్కూర్/ జడ్చర్ల/ తెలకపల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : నారాయణపేట, మహబూబ్‌నగర్ జిల్లాల్లో ఇద్దరు యువతులు, నాగర్‌కర్నూల్ జిల్లాలో ఓ వృద్ధుడు అదృశ్యం అయ్యారు. పోలీసులు తెలిపిన వవివరాలిలా ఉన్నాయి. నారాయణపేట జిల్లా, ఊట్కూరు మండలంలోని ఎడవెల్లి గ్రామానికి చెందిన బైండ్ల బాలప్ప కుమార్తె బైండ్ల అంజలి ఆదివారం మక్తల్‌కు వెళ్లి వస్తానని అవ్వ కిష్టమ్మకు చెప్పి ఇంటి నుంచి వెళ్లిపోయింది. సాయంత్రం వరకు తిరిగి రాకపోవడంతో కుటుంబసభ్యులు చుట్టుపక్కల వారికి, బంధువులకు ఫోన్ చేసి ఆరా తీశారు. ఆచూకీ లభించకపోవడంతో యువతి మేనత్త సోమవారం సాయంత్రం పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ రమేశ్ తెలిపారు.

● మహబూబ్‌నగర్ జిల్లా, జడ్చర్ల మండలం గోప్లాపూర్ గ్రామానికి చెందిన పాషా కుటుంబ సభ్యులతో జడ్చర్ల మునిసిపాలిటీలోని బురెడ్డిపల్లిలో నివాసం ఉంటున్నాడు. ఈనెల ఆరున అర్ధరాత్రి పాషా కుమార్తె సఫియాబేగం ఇంటి నుంచి అదృశ్యం అయ్యింది. గమనించిన కుటుంబసభ్యులు ఆమె ఆచూకీ కోసం యత్నించినా ఫలితం లేకపోయింది. దీంతో తండ్రి పాషా సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కమలాకర్ తెలిపారు.

● నాగర్‌కర్నూల్ జిల్లా తెలకపల్లి మండల పరిధిలోని గౌరెడ్డిపల్లికి చెందిన మన్యం శ్రీరాములు (65) గత నెల 28న మద్యం తాగి వచ్చి కుటుంబ సభ్యులతో గొడవ పడ్డాడు. వారు మందలించడంతో మరుసటి రోజు తెల్లవారుజామున ఇంట్లో ఎవరికీ చెప్పకుండా వెళ్లిపోయి తిరిగి రాలేదు. దీంతో కుటుంబసభ్యులు బంధువులు, స్నేహితుల ఇళ్లలో వెతికినా ఆ చూకీ లభించలేదు. దీంతో అతడి కుమారుడు మన్యం రామకృష్ణ సోమవారం పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ బి.నరేశ్ తెలిపారు.


మన్యం శ్రీరాములు

ఆటో, బైక్ ఢీకొని మహిళకు గాయాలు

భూత్పూర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఆటో, మోటారు సైకిల్ ఎదురెదురుగా ఢీకొన్న సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న మహిళలకు తీవ్ర గాయాలు అయ్యాయి. ఈ సంఘటన 44వ జాతీయ రహదారిపైన ఆదివారం రాత్రి చోటు చేసుకుంది. ఎస్‌ఐ చంద్రశేఖర్ కథనం ప్రకారం.. రంగారెడ్డి జిల్లా, మహేశ్వరం మండలం భగత్‌సింగ్‌నగర్, సరూర్‌నగర్‌కు చెందిన పెద్దపల్లి లక్ష్మీదేవి, కూతురు మీనారెడ్డితో పాటు ఎండీ.ఫజల్, సయ్యాద్ సాబోద్ధిన్ కలిసి ఆటోలో ఆదివారం రాత్రి సికింద్రాబాద్ నుంచి గద్వాలకు బయలుదేరారు. తాటిపర్తి గ్రామ శివారులో రాగ్‌రూట్‌లో ఓ వ్యక్తి బైక్‌పై వస్తూ ఆటోను ఢీకొట్టింది. ఈ సంఘటనలో ఆటోలో ప్రయాణిస్తున్న మీనారెడ్డికి తీవ్రగాయాలు అయ్యాయి. గాయపడిన మీనారెడ్డిని చికిత్స నిమిత్తం జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పెద్దపల్లి లక్ష్మీదేవి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లుగా ఎస్‌ఐ తెలిపారు.

డ్రంకెన్ డ్రైవ్ కేసులో ఇద్దరికి జైలు శిక్ష

తాడూరు/నాగర్‌కర్నూల్ క్రైం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : డ్రంకెన్ డ్రైవ్ కేసులో పట్టుబడిన ఇద్దరికి జైలు శిక్ష విధిస్తూ న్యాయాధికారి తీర్పు ఇచ్చినట్లు పోలీసులు తెలిపారు. తాడూరు ఎస్‌ఐ గురుస్వామి, నాగర్‌కర్నూల్ ఎస్‌ఐ గోవర్ధన్ తెలిపిన వివరాలిలా ఉన్నాయి. తాడూరులో ఆదివారం పోలీసులు నిర్వహించిన డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, గోదావరి ,జిల్లా అనంతపల్లి గ్రామానికి చెందిన కిశోర్ పట్టుబడ్డాడు. అతడిని సోమవారం కోర్టులో హాజరు పరచగా, ఒక రోజు జైలు శిక్ష విధిస్తూ జిల్లా ప్రిన్సిపల్ కోర్టు న్యాయాధికారి శ్రుతిదూత తీర్పు వెల్లడించారు. అలాగే ఏదుల గ్రామానికి చెందిన రావటి యాదగిరి ఇటీవల డ్రంకెన్ డ్రైవ్ తనిఖీల్లో పట్టుబడ్డాడు. పోలీసులు అతడిని కోర్టులో హాజరు పరచగా, మూడు రోజుల జైలు శిక్ష విధించారు.

వర్షం కోసం ఎదురుచూపులు

» గద్వాల జిల్లాలో 14.3 శాతం తక్కువ వర్షపాతం

» 'పేట' జిల్లాలోని 10 మండలాల్లో లోటు..

» ఆందోళన చెందుతున్న రైతులు

» వరుణ దేవుడికి ప్రత్యేక పూజలు


విత్తనాలు వేసేందుకు సిద్ధం చేసిన వ్యవసాయ భూమి

గద్వాల/ నారాయణపేట టౌన్/ జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఈ ఏడాది వర్షాలు సమృద్ధిగా కురిసి పంటల సాగు ఆశాజనకంగా ఉంటుందని వాతావరణ శాఖ వేసిన అంచనాలు తప్పిపోయాయి. జూన్ నెల మొదట్లో వర్షాలు సమృద్ధిగా కురిసి రైతులను సంతోష పెట్టిన వరుణుడు, ఆ తర్వాత ముఖం చాటేశాడు. జోగుళాంబ గద్వాల జిల్లాలో ఖరీఫ్‌లో ఇప్పటికే 80 శాతం విత్తనాలు వేసుకోవాల్సి ఉండగా, 30 శాతం కూడా విత్తుకోని పరిస్థితి నెలకొంది. జూన్‌లో సాధరణం కంటే 14.3 శాతం లోటు వర్షపాతం నమోదయ్యింది. అదే విధంగా ఈనెల లోనూ వర్షాలు కురవకపోవడంతో రైతులకు నిరాశే మిగిలింది. ఇప్పటికే విత్తనాలు వేసిన పొలాల్లో మొలకలు వాడు ముఖం పడుతున్నాయి. విత్తేందుకు పొలాలను సిద్ధం చేసుకున్న రైతులు వాన కోసం ఎదురు చూస్తున్నారు. నారాయణపేట జిల్లాలో రైతులు వర్షాధారంగా పత్తి, కంది, పేసర, జొన్న, పంటలను సాగు చేశారు. కానీ దాదాపు 10 రోజులుగా వర్షం కురువకపోవడంతో ఆందోళన చెందుతున్నారు. ఈ నెల చివరి నాటికి విత్తనం పడితేనే పంటల సాగు, దిగుబడి ఆశించిన స్థాయిలో ఉంటుంది. అందుకే రైతులు కరుణించు వరుణ దేవుడా.. అంటూ పూజలు చేస్తున్నారు.


లింగనవాయి గ్రామంలో వర్షం లేక వాడు పడుతున్న పత్తి పంట, నెర్రలు విచ్చుతున్న పొలాలు

1.19 లక్షల ఎకరాల్లోనే సాగు

జోగుళాంబ గద్వాల జిల్లాలో జూన్ నెలలో వర్షంపాతం తక్కువగా నమోదు కావడంతో రైతులు పూర్తి స్థాయిలో పంటలను సాగు చేయలేదు. జూలైలోనూ అదే పరిస్థితి నెలకొన్నది. సాధారణ సాగు 3.73 లక్షల ఎకరాలు కాగా, ఇప్పటి వరకు 1,19,73 ఎకరాలలో మాత్రమే రైతులు సాగు చేశారు. ఇందులో పత్తి సాగే లక్ష ఎకరాలు ఉంది. అందులో సీడ్‌పత్తి సాగు 20,290 ఎకరాలు కాగా, కమర్షియల్ పత్తి 87,127 ఎకరాల్లో సాగయ్యింది. కందులు 7,348. వేరుశనగ 450, మొక్కజొన్న 1,843, పొగాకు 1,300 ఎకరాలు, మిర్చి 520, ఉల్లి 403, కూరగాయలు 120 ఎకరాల్లో సాగయ్యాయి.

మూడు ప్రాజెక్టుల పైనే ఆశలు

నడిగడ్డ రైతులు మూడు ప్రాజెక్టులపై ఆశలు పెట్టుకున్నారు. ఈ ఏడాది కర్ణాటక, మహారాష్ట్రలలో కురుస్తున్న వర్షాలకు ప్రాజెక్టులు జలకళను సంతరించుకున్నాయి. ఇప్పటికే జూరాల, తుంగభద్ర ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో నిండగా, ఆర్డీఎస్‌కు కూడా నీళ్లు వస్తున్నాయి. నెట్టెంపాడు ప్రాజెక్టులో భాగమైన ర్యాలంపాడు, గూడెందొడ్డి రిజర్వాయర్లు నిండిపోవడంతో కాలువలకు నీరు వదిలారు. దీంతో రైతులు వరి నారు మళ్లు వేసుకున్నారు. మరో 15 రోజుల్లో వరి నాట్లు పడే అవకాశం ఉంది. దీంతో దాదాపు 95 వేల నుంచి లక్ష ఎకరాల వరకు వరి సాగు అయ్యే అవకాశం ఉంది. కానీ మెట్ట పంటల పరిస్థితి ఆశాజనకంగా లేదు. ఈ నెలలో వర్షం కురిస్తే తప్ప, పూర్తి స్థాయిలో పంటలు సాగయ్యే అవకాశం లేదు.

● నాగర్‌కర్నూల్ జిల్లాలో జూన్‌లో సాధారణ వర్షపాతం 84.9 మిల్లీమీటర్లు కాగా, 90.5 మిల్లీమీటర్ల వ ర్షపాతం నమోదయ్యింది. ఈ నెలలో ఇప్పటివరకు 49.9 మిల్లీమీటర్లకు గాను, 39 మిల్లీమీటర్ల వర్షం మాత్రమే కురిసింది.

● వనపర్తి జిల్లాలో జూన్‌లో సాధారణ వర్షపాతం 86.6 మిల్లీమీటర్లు కాగా, 92.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. 4 మండలాల్లో లోటు, 7 మండలాల్లో సాధారణం, 4 మండలాల్లో అధిక వర్షపాతం నమోదయ్యింది.

ఈనెలలో ఇప్పటివరకు 58.2 మిల్లీమీటర్లకు గాను, 46.6 మిలీమీటర్ల వర్షం కురిసింది. 10 మండలాల్లో లోటు, 4 మండలాల్లో సాధారణం, ఒక మండలంలో లోటు వర్షపాతం నమోదయ్యింది.

● మహబూబ్‌నగర్ జిల్లాలో సాధారణ వర్షపాతం 66.4 మిల్లీమీటర్లు కాగా, 46.2 మీటర్ల వర్షం కురిసింది. 11 మండలాల్లో లోటు, 6 మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యింది.

జూన్, జూలైలో లోటు వర్షపాతం

జోగుళాంబ గద్వాల జిల్లాలో జూన్, జూలై నెలల్లో సాధారణం కంటే తక్కువ వర్షపాతం నమోదైంది. జూన్‌లో సాధారణ వర్ష పాతం 84.4 మిల్లీమీటర్లు కాగా, 72.4 మిల్లీమీటర్లు నమోదయ్యింది. అంటే దాదాపు 14.3 శాతం తక్కువగా నమోదు అయ్యింది. ఇందులో మానవపాడులో 54 శాతం, ఉండవెల్లిలో 39, ధరూర్‌లో 28, ఎర్రవల్లిలో 27, అలంపూర్‌లో 25, వడ్డేపల్లిలో 19, అయిజలో 18 శాతం తక్కువ వర్షం కురిసింది. మల్దకల్, గట్టు మండలాల్లోనే సాధారణం కంటే ఎక్కువ వాన కురిసింది. ఈ నెలలో 2, 3 తేదీల్లో కురిసిన వర్షం వాడు పట్టిన మొక్కలకు ప్రాణం పోసింది. ఆ తర్వాత వాన జాడ కరువయ్యింది. అలాగే గట్టు, కేటీదొడ్డి, ధరూర్, గద్వాల, ఇటిక్యాల, ఎర్రవెల్లి మండలాల్లో ఈ నెలలోనూ లోటు వర్షపాతం ఉంది. నారాయణపేట జిల్లాలో జూలైలో సాధారణ వర్షపాతం 87.5 మిల్లీమీటర్లకు గాను, 52.6 మిల్లీమీటర్లుగా నమోదయ్యింది. జిల్లాలో 13 మండలాలుండగా, దామరగిద్ద మండలంలో అధిక వర్షపాతం నమోదయ్యింది. సాధారణం 86.9 మిల్లీమీటర్లు కాగా, 99.3 మిల్లీమీటర్ల వర్షం కురిసింది. మద్దూరు, గుండుమాల్ మండలాల్లో సాధారణ వర్షపాతం నమోదయ్యింది. మిగతా 10 మండలాల్లో లోటు వర్షపాతం ఉంది. దీంతో చెరువుల్లో నీరు చేరకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో గెలుపే లక్ష్యం

» మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ



సమావేశంలో మాట్లడుతున్న ఎంపీ డీకే అరుణ

మిడ్జిల్, జూలై 14:(ఆంధ్రజ్యోతి) : స్థానిక సంస్థల ఎన్నికల్లో పార్టీ అభ్యర్థుల విజయమే లక్ష్యంగా నాయకులు, కార్యకర్తలు కృషి చేయాలని మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణ అన్నారు. మహబూబ్‌నగర్ జిల్లా, మిడ్జిల్ మండల కేంద్రంలోని ఎంవీఎస్ గార్డెన్‌లో మిడ్జిల్, ఉర్కొండ మండలాల అధ్యక్షులు నరేశ్ నాయక్, రాజేందర్‌గౌడ్‌ల ఆధ్వర్యంలో సోమవారం విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రాష్ట్రంలో పేరుకే ప్రజాపాలన కొనసాగుతోందని, సంక్షేమ పథకాల అమలులో వివక్ష చూపుతున్నారని విమర్శించారు. కేవలం కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలకు లబ్ధి చేకూర్చేలా అధికార పార్టీ నాయకులు వ్యవహరిస్తున్నారని మండిపడ్డారు. ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపికలోనూ వివక్ష చూపుతున్నారని ఆరోపించారు. పేద ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర ప్రభుత్వం పని చేస్తోందన్నారు. దేశ రక్షణతో పాటు పేద ప్రజలందరికీ సంక్షేమ పథకాలను అందించాలని ప్రధాని నరేంద్రమోదీ కృత నిశ్చయంతో ముందుకు సాగుతున్నారన్నారు. అనంతరం వాటర్ ప్లాంట్‌ను ప్రారంభించారు. ప్లాంట్ ఏర్పాటుకు స్థలాన్ని దానం చేసిన కూచూరు భీంరెడ్డి, ఆయన కుమారుడు పీఏసీఎస్ చైర్మన్ శ్రీనివాస్‌రెడ్డిలను సన్మానించారు. అనంతరం అక్కడే మొక్కలు నాటారు. ఆ తర్వాత పీఎం రిలీఫ్‌ఫండ్ ద్వారా మంజూరైన రూ. 58 వేలను చెక్కును బోయిన్‌పల్లి గ్రామానికి చెందిన లబ్ధిదారుడు నరేందర్‌కు అందించారు.

మాజీ సర్పంచ్ రాధిక భర్త వెంకట్‌రెడ్డి ఇటీవల మృతి చెందగా, వారి కుటుంబసభ్యులు డీకే అరుణ పరామర్శించారు. కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర కార్యవర్గ సభ్యురాలు పద్మజారెడ్డి, జిల్లా అధ్యక్షుడు శ్రీనివాస్‌రెడ్డి, బీజేపీ రాష్ట్ర నాయకులు ముచ్చర్ల జనార్దన్‌రెడ్డి, జిల్లా ప్రధాన ప్రధాన కార్యదర్శులు రాజేశ్వర్, కిరణ్‌కుమార్‌రెడ్డి, మహిళా మోర్చా జిల్లా అధ్యక్షురాలు సాహితీరెడ్డి, బీజేవైఎం జిల్లా అధ్యక్షుడు పల్లె తిరుపతి, జిల్లా అధికార ప్రతినిధి బాలవర్ధన్‌గౌడ్, కిసాన్‌మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షుడు బాలకృష్ణ, నాయకులు వెంకటేశ్వర్‌రెడ్డి, చిర్ర శేఖర్‌రెడ్డి, నరేందర్, లక్ష్మారెడ్డి, వెంకట్‌రెడ్డి, ఆంజి, పరుషరాములు, శేఖర్ పాల్గొన్నారు.

'రామన్నగట్టు' పనులు ప్రారంభించాలి

» ప్రజలను మభ్య పెడుతున్న ప్రభుత్వం

» మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి


కాశీంనగర్ ఎర్రగుట్ట తండాలో కాంగ్రెస్ పార్టీ నాయకులకు కండువా కప్పి బీఆర్‌ఎస్ పార్టీలోకి ఆహ్వానిస్తున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి

వనపర్తి రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రామన్నగట్టు రిజర్వాయర్ పనులను వెంటనే ప్రారంభించాలని, లేకపోతే రైతులతో కలిసి ఆందోళన చేపడతామని మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి హెచ్చరించారు. వనపర్తి మండల పరిధిలోని ఖాసీంనగర్ ఎర్రగుట్ట తండాలో సోమవారం కాంగ్రెస్ పార్టీ గ్రామ నాయకులు నరసింహ, నీలేశ్వర్ ఆధ్వర్యంలో 40 మందికి పైగా మాజీ మంత్రి సమక్షంలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా వారికి కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కాశీంనగర్ చుట్టు పక్కల తండాల రైతులు సాగు నీటి కోసం పడుతున్న కష్టాలు తీర్చేందుకు రెండేళ్ల క్రితం అప్పటి సీఎం కేసీఆర్ రామన్నగట్టు రిజర్వాయర్ నిర్మాణానికి రూ. 50 కోట్లు మంజూరు చేశారని తెలిపారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చాక రిజర్వాయర్ నిర్మాణంపై నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందని విమర్శించారు. వెంటనే పనులు చేపట్టాలని డిమాండ్ చేశారు. హామీలు నెరవేర్చని కాంగ్రెస్ పార్టీకి స్థానిక సంస్థల ఎన్నికల్లో ఓట్లు అడిగే నైతిక హక్కు లేదన్నారు. కార్యక్రమంలో పార్టీ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, అధికార ప్రతినిధి వాకిటి శ్రీధర్, మీడియా కన్వీనర్ నందిమల్ల అశోక్, ఎస్టీ సెల్ జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్ నాయక్, నాయకులు ధర్మానాయక్, గోపాల్‌నాయక్, రవిప్రకాశ్‌రెడ్డి, మాధవ్‌రెడ్డి, నరేశ్, ఏర్వ సాయిప్రసాద్, మహేశ్వర్‌రెడ్డి, శ్రీనివాస్‌పూర్ నరసింహ, ప్రేమ్‌నాథ్‌రెడ్డి, చిట్యాల రాము, సక్రూ నాయక్ పాల్గొన్నారు.

సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలి

» కార్మిక వ్యతిరేక కోడ్‌లను రద్దు చేయాలి

» సీఐటీయూ రాష్ట్ర అధ్యక్షుడు చుక్క రాములు



భారీ ర్యాలీలో పాల్గొన్న నాయకులు, కార్మికులు

పెబ్బేరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : వివిధ రంగాల్లో పని చేస్తున్న కార్మికులకు సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలని సీఐటీయూ రాష్ట్ర అధ్యక్ష కార్యదర్శులు చుక్క రాములు, పాలడుగు భాస్కర్ డిమాండ్ చేశారు. వనపర్తి జిల్లా, పెబ్బేరు పట్టణంలోని ఓ ప్రైవేట్ ఫంక్షన్ హాల్‌లో సోమవారం నిర్వహించిన సీఐటీయూ జిల్లా 4వ మహాసభలకు వారు ముఖ్యఅతిథులుగా హాజరయ్యారు. ముందుగా పట్టణ ప్రధాన వీధుల్లో కార్మికులతో కలిసి భారీ ర్యాలీ నిర్వహించారు. అనంతరం నిర్వహించిన యూనియన్ జిల్లా అధ్యక్షుడు మండ్ల రాజు ఆధ్వర్యంలో నిర్వహించిన మహాసభలో మాట్లాడారు. కార్మికులకు కనీస వేతనం రూ.26 వేలు చెల్లించాలని, కాంట్రాక్టు, స్కీమ్ కార్మికులను రెగ్యులరైజ్ చేయాలని డిమాండ్ చేశారు. వ్యవసాయ కార్మికులతో సహా అన్ని వర్గాల కార్మికులకు సామాజిక భద్రత కల్పించాలన్నారు. ఉద్యోగులకు పాతపెన్షన్ విధానాన్ని పునరుద్ధరించాలని కోరారు. సమ్మె చేయడం కార్మికుల హక్కని ప్రకటించిన ఐఎల్‌వో (ఇంటర్నేషనల్ లేబర్ ఆర్గనైజేషన్) కన్వెన్షన్ ఒప్పందాన్ని కేంద్ర ప్రభుత్వం ఆమోదించాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ రంగ సంస్థలను ప్రైవేట్ రంగానికి బదిలీ చేయడం విరమించుకోవాలన్నారు. జాతీయ ఆస్తుల అమ్మకాన్ని నిలిపివేసి, ఖనిజ వనరుల తవ్వకాల ప్రతిపాదిత చట్టాన్ని సవరించాలని సూచించారు. కేంద్ర ప్రభుత్వం రైతు సంఘాలకు ఇచ్చిన లిఖితపూర్వక హామీలను వెంటనే అమలు చేయాలని డిమాండ్ చేశారు. విద్యుత్ సవరణ చట్టం - 2022ను రద్దు చేసి విద్యుత్తు రంగంలో ప్రైవేటీకరణను విరమించుకోవాలని కోరారు.

కార్యక్రమంలో సీఐటీయూ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు జయలక్ష్మీ, జిల్లా ప్రధాన కార్యదర్శి పుట్ట ఆంజనేయులు, జిల్లా సహాయ కార్యదర్శి రమేశ్, సూర్యవంశం రాము, మహమూద్, సునీత, మదన్, ని క్సన్, బుచ్చమ్మ, ఊషన్న, దేవన్న, బాలయ్య, శారద, తదితరులు పాల్గొన్నారు.

పీయూ డిగ్రీ ఫలితాలు విడుదల


డిగ్రీ ఫలితాలను విడుదల చేస్తున్న రిజిస్ట్రార్ జీఎన్ శ్రీనివాస్

పాలమూరు యూనివర్సిటీ, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు యూనివర్సిటీ పరిధిలో గత మే, జూన్ నెలల్లో జరిగిన డిగ్రీ పరీక్ష ఫలితాలను పరిపాలనా భవనంలో సోమవారం ఉపకులపతి ఆచార్య జీఎన్ శ్రీనివాస్, రిజిస్ట్రార్ ఆచార్య పూస రమేశ్‌బాబు విడుదల చేశారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ డిగ్రీ రెగ్యులర్ పరీక్షలు, రెండవ సెమిస్టర్‌లో బీఏ 31.45, బీకాం 36.86, బీఎస్సీ 29.74 శాతం విద్యార్థులు ఉత్తీర్ణులయ్యారని తెలిపారు. 4వ సెమిస్టర్‌లో బీఏ 51.36, బీకాం 43.57, బీఎస్సీ 37.63, 6వసెమిస్టర్‌లో బీఏ 52.27, బీకాం 54.57, బీఎస్సీ 55.58 శాతం మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారని చెప్పారు. 5వ సెమిస్టరు బ్యాక్ లాగ్ పరీక్షల్లో బీఏ 52.88, బీకామ్ 54.49, బీఎస్సీలో 46.51 శాతం మంది విద్యార్థులు పాస్ అయ్యారని చెప్పారు. కార్యక్రమంలో పరీక్షల నిర్వహణ అధికారి డాక్టర్ కె.ప్రవీణ, అకాడమిక్ ఆడిట్ సెల్ డైరెక్టర్ డాక్టర్ చంద్రకిరణ్, అదనపు పరీక్షల నిర్వహణ అధికారులు డాక్టర్ శాంతిప్రియ, డాక్టర్ అనురాధరెడ్డి, కోఆర్డినేటర్ డాక్టర్ అరుంధతిరెడ్డి ప్రిన్సిపాల్స్, అధికారులు పాల్గొన్నారు.

అడవిలో అన్వేషణ

» చిరుతల జాడ దొరక్క తలపట్టుకుంటున్న యంత్రాంగం

» బోను.. సీసీ కెమెరాలు.. డ్రోన్‌లకు చిక్కని చిరుతలు

» బోనులో మేకను పెట్టినా అటువైపు కన్నెత్తి చూడని వైనం


అడవిలో ఏర్పాటు చేసిన బోను, ఓ సెల్‌లో మేకను ఉంచిన దృశ్యం

మహబూబ్‌నగర్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పాలమూరు ప్రజలను ఉక్కిరిబిక్కిరి చేస్తున్న చిరుతల కోసం అడవిలో అన్వేషణ కొనసాగుతోంది. పది, పదిహేను రోజులుగా చిరుతలు ప్రజలకు మూడు సార్లు కనిపించాయి. అధికార యంత్రాంగం పట్టుకుందామని చేస్తున్న ప్రయత్నాలు మాత్రం విఫలమవుతున్నాయి. అసలు సీసీ కెమెరాలు, డ్రోన్‌లకు కూడా కనిపించకుండా తిరుగుతున్నాయి. చివరకు అడవిలో బోను ఏర్పాటు చేసి అందులో మేకను కూడా పెడుతున్నారు. సాయంత్రం 6 గంటలకు మేకను బోనులో వదిలి ఉదయం పట్టుకెళ్తున్నారు. స్థానికులే ఇలా రోజు ఒకరు వెళ్లి మేకను బోనులో ఉంచుతున్నారు. మేక కోసం బోనులోనే మరో సెల్‌ను ఏర్పాటు చేశారు. రాత్రి వేళ మేక అరిస్తే అరుపులను వెతుక్కుంటూ చిరుత బోనులోకి వెళ్తుందని అధికారులు ఆశిస్తున్నారు. అయితే వారం రోజులుగా మేకను బోనులో ఉంచుతున్నా చిరుత అటువైపు వెళ్లకపోవడం గమనార్హం. దీంతో అధికారులకు తలనొప్పిగా మారుతోంది. స్థానికులను తీసుకుని ప్రతీరోజు అటవీశాఖ అధికారులు, పోలీసులు చిరుతల కోసం గాలిస్తున్నారు. మంగళవారం కలెక్టర్, ఎస్పీ కూడా చిరుత సంచరించే అడవికి వెళ్లి పరిశీలించనున్నారు. వీరన్నపేట, టీడీగుట్ట ప్రాంత ప్రజలు రాత్రి వేళ ఇళ్ల నుంచి బయటకు రావడానికి వణుకుతున్నారు. అధికారులు అప్రమత్తంగా ఉండాలని ఎంత చెబుతున్నా స్థానికుల్లో మాత్రం భయం వీడటం లేదు.

ఇంటర్వ్యూ

జూనియర్ లెక్చరర్ పోస్టుకు దరఖాస్తుల ఆహ్వానం

వనపర్తి విద్యావిభాగం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లా కేంద్రంలోని మైనార్టీ రెసిడెన్షియల్ బాలుర కళాశాలలో ఖాళీగా ఉన్న జూనియర్ లెక్చరర్ అరబిక్ పోస్టుకు దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి ఎండీ అఫ్జలుద్దీన్ ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి కలిగిన వారు తమ దరఖాస్తు పత్రానికి అర్హత పత్రాలు జోడించి మైనార్టీస్ జూనియర్ బాలుర కళాశాలలో 17వ తేదీ లోగా అందజేయాలన్నారు. మరిన్ని వివరాలకు 966862937 నెంబర్‌ను సంప్రదించాలన్నారు.

విద్యారంగ సమస్యలు పరిష్కరించాలి

వనపర్తి విద్యావిభాగం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలో నెలకొన్న విద్యారంగ సమస్యలను తక్షణమే పరిష్కరించాలని పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదర్శ్ సురభికి వినతిపత్రం అందజేశారు. ప్రభుత్వ పాఠశాలలకు ప్రహరీ గోడలు, పురుష/మహిళా శౌచాలయాలు (స్కావెంజర్లు) సురక్షిత తాగునీటి వసతి లైటింగ్ సదుపాయాలు, డెస్కులు, బల్లలు వంటి మౌలిక వసతులు కల్పించాలని, ప్రైవేటు పాఠశాలలో ఫీజుల దోపిడీని అరికట్టాలని, పాఠశాలల్లో పుస్తకాలు బ్యాగులు అమ్మకుండా నియంత్రించాలన్నారు. పవన్‌కుమార్, శివ, అనిల్, నాగరాజు, నిఖిల్, రాజు తిమ్మప్ప పాల్గొన్నారు.

నైట్ హాల్ట్ బస్సు సర్వీసులను పునరుద్ధరించాలి

ఖిల్లాఘణపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలో రాత్రి వేళ నిలిపే మహబూబ్‌నగర్ నైట్ హాల్ట్ బస్సు సర్వీసును పునరుద్ధరించాలని సోమవారం పీఏసీఎస్ వైస్ చైర్మన్ శ్యామ రాజు ఆధ్వర్యంలో గ్రామస్థులు వనపర్తి బస్సు డిపో మేనేజర్ వేణుగోపాల్‌కు వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు గోనెల శంకర్, ఆంజనేయులు, రాములు, శ్రీనివాసులు గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు చేతి కర్రల పంపిణీ

కొత్తకోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని రామనంతపూర్‌కి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు మహేష్ ఈదులబావి తండాలోని వృద్ధులకు నడవడానికి చేతి కర్రలు, స్టాండ్స్‌లను సోమవారం అందజేశారు. చేతి కర్రలు, స్టాండ్స్ అందజేసిన మహేష్‌కు ధన్యవాదాలు తెలిపారు. తండా మాజీ సర్పంచ్ శ్రీనివాసులు నాయక్, లక్ష్మణ్ నాయక్, బొజ్యా నాయక్, లింగా నాయక్ తదితరులు ఉన్నారు.

పాఠశాల ఆవరణలో మురుగు తొలగింపు

ఆత్మకూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఆత్మకూరు మునిసిపాలిటీలోని ప్రభుత్వ ఉర్దూ మీడియం హై స్కూల్ చుట్టూ ఉన్న మురుగు నీటిని ఆత్మకూరు మునిసిపాలిటీ ఆధ్వర్యంలో ఎక్స్‌కవేటర్‌తో తొలగించినట్లు ఎంఐఎం నాయకులు తెలిపారు. పాఠశాల డ్రైనేజీ లేని కారణంగా వర్షం నీరు అలాగే ఆయా కాలనీల్లోని మురుగు పాఠశాల ఆవరణలో చేరి దుర్వాసన వస్తుందని ఇది వరకే మునిసిపల్ కమిషనర్ శశిధర్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం స్పందించి సోమవారం ఎక్స్‌కవేటర్‌తో మురుగునీటిని తొలగించారు. నిరంజన్, మహమ్మద్ జావిద్, హమీద్ పాల్గొన్నారు.


22న అమరచింతలో పోచమ్మ బోనాలు

అమరచింత, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : అమరచింత పోచమ్మ బోనాలు ఈనెల 22న నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ అధ్యక్ష కార్యదర్శులు విష్ణు, తాటికొండ రమేష్ పేర్కొన్నారు. ఆదివారం కమిటీ సభ్యులతో కలిసి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి అక్కడి ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. ఆలయ ఆవరణలో చెత్తా చెదారాన్ని తొలగించి, రంగులు, పారిశుధ్య కార్యక్రమాలు తదితర ఏర్పాట్లను పరిశీలించినట్లు తెలిపారు. గ్రామ పెద్దలు కృష్ణయ్య, చిన్న బుచ్చన్న, రాజు, రవి, బాబన్న, గోపి, కృష్ణన్న తదితరులు పాల్గొన్నారు.

జూనియర్ కళాశాలలకు ప్రిన్సిపాల్స్ నియామకం

వనపర్తి విద్యావిభాగం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి జిల్లాలోని ఆరు జూనియర్ కళాశాలకు ఇంటర్మీడియట్ విద్యా డైరెక్టర్ కృష్ణ ఆదిత్య ఉత్తర్వుల ప్రకారం నూతన ప్రిన్సిపాల్స్‌ను నియమించినట్లు ఇంటర్మీడియట్ విద్యాధికారి అంజయ్య ఒక ప్రకటనలో తెలిపారు. వనపర్తి బాలికల జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా పి. ఆనంద్, పెద్దమందడి కళాశాల ప్రిన్సిపాల్‌గా భీమసేన, పాన్‌గల్ కళాశాల ప్రిన్సిపాల్‌గా తిరుమల రావు, శ్రీరంగాపూర్ కళాశాల ప్రిన్సిపాల్‌గా ఈ.జె మోజెస్, ఆత్మకూరు కళాశాల ప్రిన్సిపాల్‌గా సైదులు, వీపనగండ్ల కళాశాల ప్రిన్సిపాల్‌గా శివ గౌడ్ సోమవారం రిపోర్టు చేశారు.

సిమెంట్ లారీ బోల్తా



చెల్లాచెదురుగా పడిపోయిన సిమెంట్ బస్తాలు

ఖిల్లాఘణపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : హైదరాబాద్ పవన్ ట్రాన్స్‌పోర్టుకు చెందిన లారీలో తాండూరు నుంచి ఖిల్లాఘణపురం మండలం సోలీపూర్‌లోని సిమెంట్ దుకాణానికి 540 సిమెంట్ బస్తాలతో బయలుదేరింది. లారీ మానాజీపేట శివారు ప్రధాన రహదారి పైకి రాగానే డ్రైవర్ నిద్రమత్తులోకి జారుకోవడంతో లారీ అదుపు తప్పి పంటపొలంలోకి దూసుకెళ్లి బోల్తా పడింది. లారీ కింద పడిన వెంటనే స్థానికులు లారీ క్యాబిన్ నుంచి డ్రైవర్‌ను పైకి లాగి కాపాడారు. డ్రైవర్ తిరుపతయ్యకు చిన్నపాటి గాయాలయ్యాయి. లారీలోని సిమెంట్ బస్తాలు పంట పొలంలో చెల్లా చెదురుగా పడిపోయాయి.

బయట తింటే రోగాలే..

- నిబంధనలు పాటించని హోటళ్లు, బేకరీలు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్ల నిర్వాహకులు
- ఫిర్యాదు చేస్తేనే అధికారుల తనిఖీలు

వనపర్తి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలోని పలు మునిసిపాలిటీ కేంద్రాల్లో వెలిసిన రెస్టారెంట్లలో మీద మెరుగు.. లోపల మురుగు అనే చందంగా తయారయ్యాయి. ఇటీవల జిల్లా కేంద్రంలోని ఓ పేరు మోపిన రెస్టారెంట్‌లోకి ఓ వ్యక్తి తినడానికి వెళ్లి మటన్ బిర్యానీ ఆర్డర్ ఇచ్చాడు. వారికి ఇచ్చిన మటన్ బిర్యానీలో కుళ్లిన మటన్ ముక్కలు రావడంతో రెస్టారెంట్ సిబ్బందిని ప్రశ్నించాడు. వారు దురుసుగా ప్రవర్తించడంతో వెంటనే అతను ఫుడ్ సేఫ్టీ అధికారులకు ఫిర్యాదు చేశాడు. ఇలాంటి ఘటనలు జిల్లాలో నాలుగు రోజులకు ఒకటి చోటు చేసుకుంటూనే ఉన్నాయి. అయినా ఫుడ్ సేఫ్టీ అధికారులు ఫిర్యాదు చేస్తేనే తనిఖీలు చేపడుతున్నారు తప్పా అసలు పట్టించుకోవడంలేదు. ప్రధానంగా టిఫిన్ సెంటర్లు, బేకరీలు, స్వీట్ హౌజ్‌లు, ఫాస్ట్ ఫుడ్ సెంటర్లలో తినుబండారాల నాణ్యతను పరిశీలించే నాథుడే కరువయ్యారు.



బేకరీ నిర్వాహకులకు జరిమానా విధిస్తున్న మునిసిపల్ సిబ్బంది(ఫైల్)

సర్వం కల్తీమయం

నాసిరకం నూనెలు, పిండి అనారోగ్యానికి గురి చేసే రంగులను వాడుతున్నారు. కొంత మంది యజమానులు మిగిలిన చికెన్, ఇతర పదార్థాలను డీ ఫ్రిజ్‌లో నిల్వ చేసి మరుసటి రోజు విక్రయిస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి.



బస్టాండ్ సమీపంలోని హోటల్‌లో ఇడ్లీలో జెర్రీ

పట్టించుకోని ఫుడ్ సేఫ్టీ అధికారులు

ఇటీవల జిల్లా కేంద్రంలో పలు ఘటనలు జరిగి ఫిర్యాదు చేస్తేనే ఫుడ్ సేఫ్టీ అధికారులు హడావిడి చేసి నామమాత్రంగా తనిఖీలు చేపట్టి వెళ్లిపోయారు. అధికారులు ఇప్పటికైనా స్పందించి జిల్లాలోని హోటల్స్ బేకరీలు ఫాస్ట్‌ఫుడ్ సెంటర్‌లపై తనిఖీలు చేపట్టి ఆరోగ్యాన్ని కాపాడేందుకు చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

కొన్ని సంఘటనలు ఇలా..

జిల్లా కేంద్రంలోని కొత్త బస్టాండ్ సమీపంలో ఓ హోటల్‌లో కస్టమర్ ఇడ్లీ ఆర్డర్ చేయగా ఇడ్లీలో బల్లి చనిపోయి కనిపించింది. ఇదేమిటని నిలదీయగా హోటల్ నిర్వాహకుడు ఎదురు దాడికి యత్నించాడు. వెంటనే అతను మునిసిపల్ అధికారుల సహకారంతో ఫుడ్ సేఫ్టీ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటన స్థలానికి చేరుకుని పరిశీలించి జరిమానా విధించారు.

● ప్లాస్టిక్ కవర్ల నివారణలో భాగంగా మునిసిపల్ అధికారులు బేకరీలో తనిఖీ చేస్తుండగా.. జిల్లా కేంద్రంలోని పాత బస్టాండ్ వద్ద ఉన్న ఓ బేకరీలో వంట గదిలో అపరిశుభ్ర వాతావరణం, కుళ్లిన పదార్థాలు కనిపించడంతో వెంటనే వారు బేకరి యజమానిని నిలదీయగా పొంతనలేని సమాధానం చెబుతుండడంతో అతనికి జరిమానా విధించారు.

● జిల్లా కేంద్రంలోని రాజీవ్‌చౌరస్తా వద్ద ఓ పేరు మోసిన హోటల్లో ఇటీవలే ఓ కస్టమర్ మటన్ బిర్యానీ తినడానికి వెళ్లి ఆర్డర్ ఇచ్చాడు. బిర్యానీలో కుళ్లిన మటన్ ముక్కలు రావడంతో ఇదేమిటని నిలదీయగా హోటల్ నిర్వాహకుడు ఎదురు ప్రశ్నించాడు. ఈ విషయాన్ని ఫుడ్ సేఫ్టీ అధికారుల దృష్టికి తీసుకువెళ్లగా జరిమానా విధించినట్లు సమాచారం.

ప్రజావాణి ఫిర్యాదులకు పరిష్కారం చూపాలి

వనపర్తి రాజీవ్‌చౌరస్తా, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ప్రజావాణి ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కారం చూపాలని కలెక్టర్ ఆదర్శ్ సురభి ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో అదనపు కలెక్టర్ (రెవెన్యూ) వెంకటేశ్వర్లు, అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు) యాదయ్య, ఆర్డీవో సుబ్రహ్మణ్యంతో కలిసి ఆయన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... ప్రజావాణి సమస్యలపై ఎప్పటికప్పుడు స్పందిస్తూ ఫిర్యాదుదారులకు తగిన సమాచారం అందించాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. సీఎం ప్రజావాణి, మంత్రి ద్వారా ఈ జిల్లాకు సంబంధించిన ప్రజావాణి ఫిర్యాదులు, ప్రతి సోమవారం జిల్లా ప్రజావాణిలో వచ్చే ఫిర్యాదులను ఎప్పటికప్పుడు పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు. ప్రజావాణికి మొత్తం 80 ఫిర్యాదులు వచ్చినట్లు అధికారులు తెలిపారు. అన్ని శాఖల జిల్లా అధికారులు, వీడియో కాన్ఫరెన్స్ ద్వారా మండల అధికారులు పాల్గొన్నారు.



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ ఆదర్శ్ సురభి

ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇవ్వాలి

వీపనగండ్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఇళ్లు నిర్మించుకున్న వారికి పట్టాలు ఇవ్వాలని తహసీల్దార్ కార్యాలయం ఎదుట సీపీఐ ఆధ్వర్యంలో సోమవారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కార్యవర్గ సభ్యుడు వంక గోపాల్ మాట్లాడుతూ... మండల పరిధిలోని బొల్లారంలో సర్వే నెంబర్ 618లో ప్రభుత్వ భూమి ఆక్రమనకు గురవుతుందన్నారు. మా రికార్డులు ఉన్న ఆ భూమికి గ్రామ కంఠ భూమిగా నమోదు చేయాలని, ఆ స్థలంలో ఇళ్లు నిర్మించుకున్న పేద ప్రజలకు పట్టాలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. అనంతరం వినతి పత్రాన్ని తహసీల్దార్ వరలక్ష్మికి వినతి పత్రం అందించారు. సీపీఐ మండల కార్యదర్శి కుర్మయ్య, చల్మారెడ్డి, కృష్ణయ్య, వెంకటస్వామి, శివయ్య తదితరులు పాల్గొన్నారు.



తహసీల్దార్ వరలక్ష్మికి వినతిపత్రం అందజేస్తున్న నాయకులు

రైతులకు సాగునీరు ఇవ్వడంలో ప్రభుత్వం విఫలం

- బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్

పాన్‌గల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : వానాకాలం సీజన్‌లో రైతులకు సాగునీరు ఇవ్వడంలో రాష్ట్ర ప్రభుత్వం విఫలమైందని బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు గట్టు యాదవ్, బీఆర్ఎస్ సోషల్ మీడియా జిల్లా అధ్యక్షుడు నందిమల్ల అశోక్ అన్నారు. సోమవారం మండలంలోని కిష్టాపూర్ గ్రామ సమీపంలోని ఎంజీకేఎల్ఐ డిస్ట్రిబ్యూటర్ 8 కాలువ వద్ద వారు రైతులతో నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా గట్టు యాదవ్ మాట్లాడుతూ... ప్రస్తుత వానాకాలం సీజన్‌లో సకాలంలో వర్షాలు పడక నారుమళ్లు ఎండిపోతున్నాయని, సాగు చేసే పంటలకు నీరిచ్చి ఆదుకోవాలని కోరారు. శ్రీశైలం రిజర్వాయర్ ప్రాజెక్టులో నీరు పుష్కలంగా ఉన్నా కాలువల ద్వారా నీరెందుకు ఇవ్వడం లేదని ప్రశ్నించారు. కాంగ్రెస్ ప్రభుత్వం వచ్చి 20 నెలలు గడుస్తున్నా.. రైతులను పట్టించుకునే నాథుడే కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేశారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు చంద్రశేఖర్ నాయక్, వీర సాగర్, కృష్ణ, తిరుపతయ్య యాదవ్, శేఖర్, యాదగిరి చారి, దామోదర్ రెడ్డి పాల్గొన్నారు.



కాలువను పరిశీలిస్తున్న బీఆర్ఎస్ నాయకులు

మహాసభలకు బయలుదేరిన కార్మికులు

వీపనగండ్ల, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు మండలంలో సోమవారం నిర్వహించిన సీఐటీయూ జిల్లా మహాసభలకు మండల కేంద్రం నుంచి కార్మికులు బయలుదేరి వెళ్లారు. శేఖర్‌రెడ్డి, వీరస్వామి, వీరబాబు, రాంబాబుగౌడ్, శేఖర్ పాల్గొన్నారు.



వీపనగండ్ల నుంచి బయలుదేరిన కార్మికులు

కార్మికులంతా ఏకం కావాలి

పాన్‌గల్ : కార్మిక హక్కుల కోసం కార్మికులంతా ఏకం కావాలని ఆశా కార్యకర్తలు అన్నారు. సోమవారం పెబ్బేరు పట్టణంలోని సీఐటీయూ నాలుగో మహాసభలకు మండల కార్మికులు బయలుదేరారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ... కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్మికుల హక్కుల కోసం పాటుపడాలని కోరారు. రేణుక, మాధవి తదితరులు పాల్గొన్నారు.

శ్రీరంగాపూర్ : మండల కేంద్రంతో పాటు వివిధ గ్రామ పంచాయతీల్లో పని చేస్తున్న కార్మికులు అదే విధంగా ఆశా కార్యకర్తలు, అంగన్‌వాడీ కార్యకర్తలు పెబ్బేరు మండల కేంద్రానికి తరలివెళ్లారు.

'జనాభా పెరుగుదల'పై ఉపన్యాస పోటీలు

వనపర్తి రూరల్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : వనపర్తి మండల పరిధిలోని చిట్యాల గ్రామం ఉన్నత పాఠశాలలో ప్రపంచ జనాభా దినోత్సవం సందర్భంగా సోమవారం జనాభా పెరుగుదలపై విద్యార్థులకు ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు ఆరో తరగతి నుంచి 10వ తరగతి వరకు 36 మంది విద్యార్థిని విద్యార్థులు పాల్గొన్నారు. ఉపన్యాసంలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన నిహారిక, పవన్ లకు బహుమతుల ప్రదానం చేశారు. కార్యక్రమంలో ఇన్‌చార్జి ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర గుప్తా, ఉపాధ్యాయులు రవి, సంజీవయ్య, గిరిరాజా చారి, వరదాచారి, జ్యోతిలక్ష్మి, మహమ్మద్ షఫీ, శ్రీనివాసులు, స్వరూప గోపాల్ విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



పోటీల్లో పాల్గొన్న విద్యార్థినులు

ముంపు గ్రామస్థుల సమస్యలు తీర్చాలి

రేవల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలో ముంపునకు గురైన బండరాయిపాకుల, కొంకలపల్లి గ్రామస్థుల సమస్యలు తీర్చాలని కోరుతూ బీజేపీ మండల నాయకులు, మండల అధ్యక్షుడు బాలు నాయక్ ఆధ్వర్యంలో కలెక్టర్ ఆదర్శ్ సురభికి సోమవారం వినతి పత్రం అందజేశారు.

ఎల్‌వోసీ అందజేత

రేవల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నాగపూర్‌కి చెందిన శ్రీశైలం తీవ్ర అనారోగ్యానికి గురయ్యాడు. మెరుగైన వైద్యం చేయించుకోవడానికి ఎమ్మెల్యే మేఘారెడ్డి రూ.5లక్షల ఎల్‌వోసీని సోమవారం హైదరాబాద్‌లోని తన కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు. సత్యశీలారెడ్డి, పర్వతాలు, వెంకటేష్, తిరుపతిరెడ్డి, సురేందర్‌గౌడ్ తదితరులు ఉన్నారు.

కొత్తకోటలో ఐదుగురికి..

కొత్తకోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని వడ్డెవాటలో అనారోగ్యం కారణంగా హైదరాబాద్ ఆసుపత్రుల్లో చికిత్స చేయించుకున్న ఐదుగురికి సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను అధికారులు, కాంగ్రెస్ నాయకులు లబ్ధిదారుల ఇంటికెళ్లి సోమవారం అందజేశారు. కల్వన్నకు రూ.12 వేలు, నాగన్నకు రూ.6 వేలు, జాబన్నకు రూ.7,500, మాసన్నకు రూ.6 వేలు మంజూరయ్యాయన్నారు. చెక్కులు అందజేసిన వారిలో భాను ప్రకాష్‌రెడ్డి, రాంలాల్ నాయక్, రాములు, నారాయణ, యుగంధర్ రెడ్డి, తిరుపతయ్య, ఉదయ్, బాలరాజు, నరసింహ తదితరులు పాల్గొన్నారు.

నూతన ఎంఈవోకు సన్మానం

పెద్దమందడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పెద్దమందడి మండల నూతన ఎంఈవోగా బాధ్యతలు స్వీకరించిన మంజులతను పీఆర్టీయూ తెలంగాణ, పెద్దమందడి మండల శాఖ ఆధ్వర్యంలో ఘనంగా సన్మానించారు. ఈ సందర్భంగా ఎంఈవో మాట్లాడుతూ... పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి ఉపాధ్యాయులందరు కృషి చేస్తూ... మండలానికి పేరు తీసుకురావాలన్నారు. దర్గయ్య, ప్రియవర్ధన్‌రెడ్డి, సంఘం సభ్యులు కురుమూర్తి, సూర్య సంజీవ, కృష్ణయ్య, జహంగీర్, రామ్‌చందర్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

మునిసిపల్ కార్మికుల నూతన కమిటీకి..

పెబ్బేరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : పెబ్బేరు మున్సిపాలిటీలో పని చేస్తున్న కార్మికుల నూతన కమిటీ సంఘం అధ్యక్షుడు అయూబ్, గౌరవ అధ్యక్షుడు భగవంత్, ఉపాధ్యక్షుడు బక్కన్న, బాలయ్యలతో పాటు కమిటీ సభ్యులను సోమవారం కాంగ్రెస్ నాయకులు శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించి అభినందించారు. బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్, యుగేందర్ రెడ్డి, రణధీర్ రెడ్డి, భానుప్రకాష్ రెడ్డి, రాములు, సత్యనారాయణ రెడ్డి తదితరులున్నారు.

మాజీ మంత్రి పరామర్శ

పెద్దమందడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : జంగమాయపల్లికి చెందిన అబ్బ వెంకటయ్య అనారోగ్యంతో రెండు రోజుల కిందట మృతి చెందాడు. విషయం తెలుసుకున్న మాజీ మంత్రి నిరంజన్‌రెడ్డి మృతుని కుటుంబాన్ని పరామర్శించి కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఆయన వెంట మాజీ జడ్పీటీసీ రఘుపతిరెడ్డి, చిట్యాల రాము, బాల్‌రెడ్డి, కొండల్, నక్క కృష్ణయ్య, సత్యం, అబ్బా రాములు, సంజీవరెడ్డి తదితరులు ఉన్నారు.

బాధిత కుటుంబానికి...

రేవల్లి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : ఏదుల మండలం చెన్నారం గ్రామంలో రోడ్డు ప్రమాదంలో శంకర్ ప్రసాద్‌సాగర్ మృతిచెందాడు. ఆయన కుటుంబ సభ్యులను జిల్లా సగర సంఘం అధ్యక్షుడు తిరుపతయ్య, సంఘం సభ్యులు సోమవారం పరామర్శించి ఆర్థిక సాయం అందజేశారు. వీరి వెంట గోపాల్‌పేట అధ్యక్షుడు మణి వర్ధన్‌సాగర్, చెన్నరాముడు, సత్యం, పెద్ద నాగులు, మురళి, విష్ణు, సాయి, కరుణాకర్ తదితరులు ఉన్నారు.

ప్రాథమిక పాఠశాలలకు నోట్ పుస్తకాల పంపిణీ



ఉచిత నోటు పుస్తకాలను పంపిణీ చేస్తున్న ఎంఈవో జయశంకర్

ఖిల్లాఘణపురం, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని ప్రాథమిక పాఠశాలలో చదువుతున్న విద్యార్థులకు ప్రభుత్వం అందిస్తున్న ఉచిత నోటు పుస్తకాలను మండల విద్యా వనరుల కేంద్రంలో సోమవారం మండల విద్యాధికారి జయశంకర్ ఆధ్వర్యంలో ప్రాథమిక పాఠశాల ప్రధానోపాధ్యాయులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో జయశంకర్ మాట్లాడుతూ... మండలంలోని 30 ప్రాథమిక పాఠశాలలకు 4,488 నోటు పుస్తకాలను అందజేసినట్లు తెలిపారు. ప్రభుత్వ బడిలో నాణ్యమైన విద్యతో పాటు ఉచితంగా పాఠ్య పుస్తకాలు, నోటు పుస్తకాలు, రెండు జతల యూనిఫామ్స్ అందజేస్తున్నట్లు గుర్తు చేశారు. ప్రాథమిక పాఠశాలల ప్రధానోపాధ్యాయులు ఫరీద్, జగదీశ్వర్‌రెడ్డి, శ్రీనివాసులు, ఉమా మహేశ్వర్‌రెడ్డి, బాలకృష్ణ, రాఘవేందర్, వెంకటేష్, పార్వతమ్మ పాల్గొన్నారు.

రెండో జత యూనిఫామ్స్ అందించాలి

మండల మహిళా సమాఖ్య కేంద్రంలో సోమవారం ప్రభుత్వ పాఠశాల విద్యార్థులకు ప్రభుత్వం ఉచితంగా అందించే రెండో జత యూనిఫామ్స్ సిద్ధం చేసి వెంటనే పంపిణీ చేయాలని సోమవారం మండల విద్యాధికారి జయశంకర్ సెర్ప్ ఏపీఎం రాంబాబును కోరారు. వేసవి సెలవుల్లోనే మొదటి జత యూనిఫామ్ అందజేసినట్లు గుర్తు చేశారు.

బీసీ నాయకులపై దాడులు చేస్తే సహించం

- బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్ గౌడ్

పెబ్బేరు, జూలై 14(ఆంధ్రజ్యోతి) : అగ్రవర్ణ కులాలు బీసీ నాయకులపై దాడులు చేస్తే సహించేది లేదని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రామన్ గౌడ్ హెచ్చరించారు. సోమవారం ఏర్పాటు చేసిన సమావేశంలో మాట్లాడారు. బీసీల హక్కుల కోసం పోరాడుతున్న ఎమ్మెల్సీ తీన్మార్ మల్లన్నపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. బీసీ సమాజాన్ని చైతన్యం పరుస్తున్న మల్లన్నను చూసి అగ్రవర్ణ కులాలు జీర్ణించుకోలేకనే అణచివేయాలని చూస్తున్నారని ఆరోపించారు. అగ్రవర్ణ కులాల దురహంకారాన్ని బీసీ సమాజం క్షుణ్ణంగా గమనిస్తుందని, రానున్న ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని పేర్కొన్నారు.

'ఇచ్చిన హామీలు అమలు చేస్తాం'..



ఆత్మకూరులో ఇందిరమ్మ ఇంటి లబ్ధిదారులకు మంజూరు పత్రాలు అందజేస్తున్న నాయకులు

ఆత్మకూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : కాంగ్రెస్ పార్టీ 2023 ఎన్నికల ప్రచారంలో ఇచ్చిన హామీలను అమలు చేస్తామని ఆత్మకూరు కాంగ్రెస్ పార్టీ పట్టణ అధ్యక్షుడు నల్గొండ శ్రీనివాసులు పేర్కొన్నారు. ఆత్మకూరు పట్టణ కేంద్రంలోని ఇందిరా నగర్ కాలనీలో ఇందిరమ్మ ఇంటి నిర్మాణానికి సోమవారం మార్కింగ్ చేశారు. అనంతరం ఇందిరమ్మ ఇంటి మంజూరు పత్రాన్ని లబ్ధిదారులు బైని జానకమ్మకు అందజేశారు. నాయకులు రహమతుల్లా, తులసిరాజ్, యాదగిరి, వెంకటన్న, శ్రీనివాసులు పాల్గొన్నారు.

త్వరితగతిన పూర్తి చేసుకోవాలి..

పెబ్బేరు : రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఇందిరమ్మ ఇళ్లను త్వరితగతిన పూర్తి చేసుకోవాలని జిల్లా బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు అక్కి శ్రీనివాస్ గౌడ్ తెలిపారు. సోమవారం మునిసిపాలిటీలోని 7వ వార్డులో లబ్ధిదారులతో కలిసి నిర్మాణ పనులు ప్రారంభించారు. వెంకటేష్ సాగర్, సురేందర్ గౌడ్, భానుప్రకాష్ రెడ్డి, యుగేందర్ రెడ్డి, రాములు తదితరులున్నారు.

కనీస వేతన జీవోలకు గెజిట్ చేయాలి

ఆత్మకూరు, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే కనీస వేతన జీవోలకు గెజిట్ చేయాలని తెలంగాణ మెడికల్ కాంట్రాక్టు వర్కర్స్ యూనియన్ రాష్ట్ర కార్యదర్శి సురేష్ డిమాండ్ చేశారు. తెలంగాణ వైద్య విధాన పరిషత్ పరిధిలోని ప్రభుత్వ సామాజిక ఆసుపత్రిలో పని చేస్తున్న కాంట్రాక్టు వర్కర్స్‌కు తక్షణమే ఆరు నెలల వేతన బడ్జెట్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా సోమవారం ఆత్మకూరు ప్రభుత్వ ఆసుపత్రి ముందు కార్మికులతో నిరసన వ్యక్తం చేశారు. అనంతరం మెడికల్ ఆఫీసర్ వివేక్ వినతిపత్రం అందజేశారు. ఆసుపత్రి కార్మికులు సత్తార్, శ్రీకాంత్, పార్వతమ్మ, చెన్నమ్మ, నాగమ్మ, శైలజ, బాలకృష్ణమ్మ, మణెమ్మ పాల్గొన్నారు.



మెడికల్ ఆఫీసర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

'కాంగ్రెస్ ప్రభుత్వానికి అండగా ఉందాం'

కొత్తకోట, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : బీసీలకు 42 శాతం రిజర్వేషన్ కల్పించిన రేవంత్‌రెడ్డి ప్రభుత్వానికి అండగా ఉందామని కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు బీచుపల్లి యాదవ్ అన్నారు. సోమవారం పట్టణ చౌరస్తాలో రిజర్వేషన్ పెంచినందుకు సీఎం రేవంత్‌రెడ్డి, ఎమ్మెల్యే మధుసూదన్‌రెడ్డి చిత్రపటాలకు క్షీరాభిషేకం నిర్వహించారు. ఈ సందర్భంగా బీచుపల్లి యాదవ్ మాట్లాడుతూ.. గత ప్రభుత్వం బీసీ కులాల రిజర్వేషన్ తగ్గిస్తే కాంగ్రెస్ ప్రభుత్వం 42 శాతం కల్పించిందన్నారు. కార్యక్రమానికి పార్టీ పట్టణ అధ్యక్షుడు శ్రీనివాసులు అధ్యక్షత వహించగా... జిల్లా ప్రధాన కార్యదర్శులు కృష్ణారెడ్డి, బోయెజ్, శ్రీనివాస్‌రెడ్డి, డాక్టర్ బాబు, బాలనారాయణ, శేఖర్‌రెడ్డి, నరేందర్‌రెడ్డి, వెంకటేశ్వర్‌రెడ్డి, రమణ, మిషేక్, సాయిలు యాదవ్, నరేందర్ సాగర్, రవీందర్‌రెడ్డి, బాలరాజ్, శ్రీను, పెంటన్న యాదవ్, ఏజాజ్, ముజీబ్, సుభాష్ తదితరులు పాల్గొన్నారు.



కార్యక్రమంలో మాట్లాడుతున్న బీచుపల్లి యాదవ్

మదనాపురం : బీసీలకు స్థానిక సంస్థల్లో రాష్ట్ర ప్రభుత్వం 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించడంపై మండల కాంగ్రెస్ నాయకులు సీఎం రేవంత్‌రెడ్డి చిత్రపటానికి సోమవారం మండల కేంద్రంలో పాలాభిషేకం చేశారు. ప్రశాంత్, మహేష్, వెంకట్ నారాయణ పాల్గొన్నారు.

పౌష్టికాహారంతోనే సంపూర్ణ ఆరోగ్యం

పెద్దమందడి, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రాగి జావలో అధిక ప్రోటీన్లు ఉంటాయని ఎన్ఎస్ఎస్ క్యాంపు ఇన్‌చార్జి భాస్కర్ అన్నారు. సోమవారం మండలంలోని మోజర్లలో జాతీయ సేవా పథక ప్రత్యేక శిబిరంలో నాలుగో రోజు కొండ లక్ష్మణ్ బాపూజీ ఉద్యాన కళాశాల విద్యార్థులు అంగన్‌వాడీ కేంద్రంలో పోషకాహారంపై విద్యార్థుల తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా వా రు మాట్లాడుతూ... ప్రతీ ఒక్కరు సెల్‌ఫోన్లను దూరంగా ఉంచి ఎక్కువ సమయం పిల్లలతో గడపాల ని సూచించారు. పిల్లలకు ఎక్కువగా పప్పు దినుసులు, బెల్లంతో కూడినవి పెట్టాలని వీటి ద్వారా కండరాలు, వెన్నముక్క పటిష్టంగా ఉంటుందన్నారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. శిరీష, ఆంజనేయులు, ఉద్యాన విద్యార్థులు పాల్గొన్నారు.

పేదలకు ఒక న్యాయం.. కోటీశ్వరులకు ఒక న్యాయమా?

- అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్

వనపర్తి టౌన్, జూలై 14 (ఆంధ్రజ్యోతి) : రోడ్డు విస్తరణలో పేదలు పూజలు చేసుకునే ఆలయాలు, మసీదులు, దర్గాలకు ఒక న్యాయం, కోటీశ్వరులు పూజలు చేసే ఆలయాలకు మరో న్యాయమా? అని అఖిలపక్ష ఐక్యవేదిక జిల్లా అధ్యక్షుడు సతీష్ యాదవ్ ప్రశ్నించారు. గాంధీచౌక్ నుంచి గోపాల్‌పేట రోడ్డు విస్తరణలో మిగిలిన పనులను సోమవారం పట్టణంలోని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. జిల్లా కేంద్రంలో జరిగిన రోడ్డు విస్తరణలో అనేక మంది నిరుపేదలు ఇళ్లు కోల్పోయారని, అందులో భాగంగానే రామాలయం, మసీదు, దర్గాలను తొలగించారని గుర్తుచేశారు. కానీ కోటీశ్వరులైన ఆర్యవైశ్యులు కట్టుకున్న కన్యాకాపరమేశ్వరి దేవాలయం మాత్రం తొలగించడం లేదన్నారు. ఆలయ ప్రహరీ కొంతమేర తొలగించినా.. ఎన్నికలు జరిగి ప్రభుత్వం మారడంతో, ఆ వెంటనే కొందరు ఆర్యవైశ్యులు ఎమ్మెల్యేను సన్మానించి, కూల్చిన ప్రహరీని కూడా తిరిగి పునర్నిర్మాణం చేసుకున్నారని అన్నారు. కార్యక్రమంలో శంకర్, సతీష్, రామస్వామి, రవి, కురుమూర్తి, నాగరాజు, గంధం కృష్ణయ్య, పాతబజార్ వాసులు తదితరులు పాల్గొన్నారు.



రోడ్డుకు అడ్డుగా వేసిన డ్రైనేజీని పరిశీలిస్తున్న నాయకులు